మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 101 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

గురువారం 11 జులై 2024




# మానవీయ కోణంతో వ్యవహరించండి



- రైతులతో కలెక్టర్లు నేరుగా మాట్లాడాలి
- వారికి వీలైనంత ఎక్కువ పరిహారం ఇచ్చేలా చూడాలి
- ఆర్ఆర్ఆర్ భూసేకరణకు అడ్డంకులు తొలగించాలి
- కలెక్టర్లు, అధికారులతో సమీక్షించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రత్యామ్నాయ భూకేటాయింపులతో అటవీ భూముల స్వాధీనం
- హైదరాబాద్-విజయవాడ విస్తరణ పనులు వెంటనే చేపట్టాలి
- ఎన్‌హెచ్ఏఐ పరిధి సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్, (ప్రజా మంటలు): జాతీయ రహదారులకు భూ సేకరణ విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం ఎంత ఎక్కువ పరిహారం వస్తుందో అంత రైతులకు దక్కేలా చూడాలన్నారు. తెలంగాణలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) పరిధిలో రహదారుల నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుంచి సహకారం ఉన్నా భూ సేకరణ ఎందుకు ఆలస్యమవుతోందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూములకు ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలు తక్కువ ఉండడం, మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని కలెక్టర్లు తెలిపారు. స్పందించిన ముఖ్యమంత్రి తరతరాలుగా వస్తున్న భూములను రైతులు శాశ్వతంగా కోల్పోతున్నారనే విషయాన్ని గుర్తించాలన్నారు. కలెక్టర్లు రైతులతో పిలిచి మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు.

మిగతా 2లో..

## 'రైతు భరోసా'పై దృఢ సంకల్పంతో ఉన్నాం

- రియల్టర్లను మినహాయించండి
- ప్రజాభిప్రాయ సేకరణలో రైతుసంఘాల ప్రతినిధుల వినతి
- వ్యవసాయ రంగాన్ని కాపాడుకుంటాం
- అర్హులైన వారికే రైతుభరోసా పెట్టుబడి
- సన్న,చిన్నకారు రైతులకే చేయూత
- హామీల అమలుకే ప్రజాభిప్రాయ సేకరణ
- మంత్రులు భట్టి, పొంగులేటి, తుమ్మల వెల్లడి

హైదరాబాద్, (ప్రజా మంటలు): వ్యవసాయ రంగాన్ని కాపాడుకుందామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా అందజేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీని అమలు చేయడం కోసం తమ ప్రజా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని చెప్పారు. ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన రైతు భరోసా పథకం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనందున రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓటాన్ అకౌంట్

మిగతా 2లో..



## ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో జడ్జీల పేర్లు రాయొద్దు

- హైకోర్టు ఆదేశం

- సంయమనం పాటించాలని మీడియాకు సూచన

హైదరాబాద్, (ప్రజా మంటలు): ఫోన్ ట్యాపింగ్ విషయంలో సంయమనం పాటించాలని తెలంగాణ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం పలు కీలక సూచనలు చేసింది. వ్యక్తిగత జీవితాల్లోకి వెళ్లి అనవసర రాద్ధాంతం చేయొద్దని, జడ్జిలు, వారి కుటుంబ సభ్యుల పేర్లు బహిర్గతం చేయొద్దని స్పష్టం చేసింది. ఫోన్ నంబర్లు, ఫొటోలు

మిగతా 2లో..

## నిధుల సమీకరణ కోసం ప్రభుత్వ భూముల తనఖా సరికాదు

- పరిశ్రమలకు ఇచ్చిన వాటిని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు అప్పగించేందుకు సర్కారు యత్నం

- అది చాలా ప్రమాదకరం : కేటీఆర్



హైదరాబాద్, (ప్రజా మంటలు): రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం చేతకాని రేవంత్ సర్కార్ ఇప్పుడు నిధుల సమీకరణకు ఒక ప్రమాదకరమైన మార్గం ఎంచుకున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ పరిశ్రమల శాఖకు చెందిన రూ. 20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు తనఖాపెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించాలని భావిస్తున్నట్టు సమాచారం ఉందని ఆయన తెలిపారు. దీనికి మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను పెట్టి వారికి రు.100 కోట్ల కమిషన్ ఇచ్చేందుకు సిద్ధమైంది అని మీడియాలో కథనాలు వస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మతిలేని చర్య వల్ల తెలంగాణ ప్రగతి శాశ్వతంగా కుంటుపడి, కొత్తగా పెట్టుబడులు, పరిశ్రమలు రాక, ఉద్యోగాలు రాక, మన బిడ్డలకు కొలువులు రాకుండా పోయే ప్రమాదం ఉన్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. అలాంటి చోట 400 ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య. అసలే గత ఏడు నెలలుగా రాష్ట్ర పారిశ్రామికరంగం స్తబ్ధుగా ఉంది. కొత్తగా పెట్టుబడులు రావడం లేదు. ఉన్న కంపెనీలు కూడా సరైన ప్రోత్సాహం లేక పక్కచూపులు చూస్తున్నాయి. ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కొరకు పరిశ్రమలకు ఇచ్చే భూములు తాకట్టు పెడితే.. కంపెనీలకు ఏమిస్తారు? కొత్తగా మన యువతకు ఉద్యోగాలు ఎట్లా వస్తాయి? అని రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు.

## తెలంగాణ డీజీపీగా జితేందర్

- నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు..
- వెంటనే బాధ్యతలు స్వీకరణ
- సీఎం రేవంత్‌తో మర్యాదపూర్వక భేటీ



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి జితేందర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు డీజీపీగా ఉన్న రవి గుప్తాను హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బుధవారమే ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా


మిగతా 2లో..


## 15 మంది ఐపీఎస్‌ల బదిలీలు



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణలో 15 ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. శాంతి భద్రతల అదనపు డీజీపీగా మహేశ్ భగవత్ హోంగార్డుల, ఆర్గనైజేషన్ అదనపు డీజీగా స్వాతి లక్రా, గ్రేహౌండ్స్ ఏడీజీగా స్టీఫెన్ రవీంద్ర పోలీస్ పర్సనల్ అదనపు డీజీగా విజయ్ కుమార్ (పోలీసు సంక్షేమం, క్రీడల అదనపు బాధ్యతలు), టీజీఎస్పీ బెటాలియన్ల అదనపు డీజీగా సంజయ్ కుమార్, రాచకొండ పోలీస్ కమిషనర్‌గా సుధీర్ బాబు, ఏసీబీ డైరెక్టర్‌గా తరుణ్ జోషి, మల్టీజోన్-1 ఐజీగా ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, మల్టీజోన్ -2 ఐజీగా వి.సత్యనారాయణ,రైల్వే, రోడ్ సేఫ్టీ ఐజీగా కె.రమేశ్ నాయుడు, మెదక్ ఎస్పీగా ఉదయ్ కుమార్‌రెడ్డి, వనపర్తి ఎస్పీగా ఆర్.గిరిధర్, హైదరాబాద్ తూర్పు మండలం డీసీపీగా జి.బాలస్వామి, హైదరాబాద్ పశ్చిమ మండలం డీసీపీగా జి.చంద్రమోహన్, సీఏఆర్‌హెడ్ క్వాటర్స్ డీసీపీగా రక్షితమూర్తిలు నియమితులయ్యారు.

## ప్రజా నాడి



## భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుంది

- పుతిన్- మోదీ భేటీపై స్పందించిన అమెరికా

వాషింగ్టన్ (ప్రజా మంటలు): రష్యాతో భారత్ సన్నిహిత సంబంధాలు కొనసాగించడంపై ఆందోళనలు ఉన్నప్పటికీ.. భారత్‌తో తమ వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుందని అగ్రరాజ్యం స్పష్టం చేసింది.ఆ రెండు దేశాల మధ్య

మిగతా 2లో..



## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

- పాల ట్యాంకర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు
- ప్రమాదంలో 18మంది దుర్మరణం

లక్నో (ప్రజా మంటలు): ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉన్నావ్ జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై స్లీపర్ బస్సు, పాల ట్యాంకర్‌ను ఢీకొనడంతో 18 మంది మృతి చెందగా, 19 మందికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఉన్నావ్ జిల్లా బంగార్‌మౌ ప్రాంతంలోని జోజికోట్ గ్రామ సమీపంలోని బెహతా ముజావర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను

మిగతా 2లో..

## విడాకులు ఇచ్చినా భరణం ఇవ్వాల్సిందే



8లో..

మొదటి పేజీ తరువాయి

## మానవీయ కోణంలో భూసేకరణ

రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం, ఉత్తర భాగం వేర్వురుగా చూడొద్దని, ఆ రెండింటికి కలిపి ఒకే నెంబర్ కేటాయించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరగా, ఆయన సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఆ ప్రక్రియకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఎన్ హెచ్ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం (ట్రైపార్టియేట్ అగ్రిమెంట్) కుదుర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్పారు. వెంటనే దానిని పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణలో ఉన్న ఆటంకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అలైన్ మెంట్ విషయంలో పొరపడి కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారని, దాంతో హైకోర్టు స్టే ఇచ్చిందని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హన్మంత్ కె.జెండగే తెలిపారు. స్టే తొలగింపునకు వచ్చే శుక్రవారం నాటికి కౌంటర్ దాఖలు చేయాలని కలెక్టర్ కు ముఖ్యమంత్రి సూచించారు. నాగ్ పూర్–విజయవాడ కారిడార్ లో ఖమ్మం జిల్లాలో భూ సేకరణ పరిస్థితి ఏమిటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఖమ్మం సమీపంలోని విలువైన భూముల గుండా రహదారి పోతుందని, పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తల్లాడ–దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్నందున, ప్రస్తుతం ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్ హెచ్ఏఐ అధికారులు సూచిస్తున్నారని, దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని, జాతీయ రహదారిగానే దానిని కొనసాగించాలని మంత్రి తుమ్మల అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ నాగ్ పూర్–విజయవాడ కారిడార్ లో భాగంగా నిర్మిస్తున్న రహదారిలో పెద్ద గ్రామాలున్న చోట సర్వీసు రోడ్లు నిర్మించాలని, రైతులు పొలాలకు వెళ్లేందుకు వీలుగా అవసరమైన చోట్ల అండర్ పాస్ లు నిర్మించాలని ఎన్ హెచ్ఏఐ అధికారులను కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి బదులిచ్చారు. జాతీయ రహదారుల వెంట వ్యవసాయ వాహనాలు, రైతులు వినియోగించుకునేలా గ్రావెల్ రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదన సమీక్షలో వచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు సభ్యుడు అనిల్ చౌదరి తెలిపారు. గ్రావెల్ రహదారి నిర్మించడం వలన రైతులకు ఉపయోగపడడంతో పాటు భవిష్యత్తులో రహదారి విస్తరణకు ఇబ్బందులు ఉండవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

### సమన్వయంతో ముందుకు సాగండి

ఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల, విజయవాడ–నాగ్ పూర్ కారిడార్ రహదారులకు సంబంధించి అటవీ శాఖ భూముల బదలాయింపు సమస్య సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వచ్చింది. స్పందించిన ముఖ్యమంత్రి అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని నిజామాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఈ విషయంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను అటవీ శాఖకు బదలాయించి అటవీ శాఖ భూములను తీసుకొని రహదారుల నిర్మాణానికి ఉన్న ఆటంకాలను తొలగించాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ శాఖల పరిధిలోని యుటిలిటీస్ తొలగింపునకు సంబంధించి చెల్లింపులు వేగవంతం చేయాలని, ఏవైనా సమస్యలుంటే ఎన్ హెచ్ఏఐతో సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ –మన్నెగూడ రహదారి పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. అందుకు ఎన్హెచ్ ఏఐ అధికారులు అంగీకరించారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల విస్తరణ పనులకు భూ సేకరణ పూర్తయినందున వెంటనే పనులు చేపట్టాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్ చౌదరిని కోరారు. రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన బదులిచ్చారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శేషాద్రి, సీఎంవో అధికారులు మాణిక్ రాజ్, చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసిం, మౌలిక వసతుల సలహాదారు శ్రీనివాసరాజు, ఎన్ హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి రజాక్, పీసీసీఎఫ్ డోబ్రియల్, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన, జాయింట్ సెక్రటరీ హరీష్, మెదక్, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నిజామాబాద్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## 'రైతు భరోసా'పై దృఢ సంకల్పంతో ఉన్నాం

బడ్జెట్ ను ప్రవేశ పెట్టిందన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని చెప్పారు. రైతుభరోసా పథకం అమలు కోసం ఉమ్మడి పది జిల్లాల్లో పర్యటించి ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ క్రమంలో రైతు భరోసా అమలుపై తెలంగాణ సర్కార్ కసరత్తు చేస్తోంది. జిల్లాల వారీగా అనేక మంది నుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో మంత్రుల బృందం పర్యటించింది. ఈ జిల్లాల పర్యటన ముగిసిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అందులో భాగంగానే జూలై 10 ఖమ్మం, 11న అదిలాబాద్, 12న మహబూబ్ నగర్, 15న వరంగల్, 16న సంగారెడ్డి(మెదక్), 18న నిజామాబాద్, 19న కరీంనగర్, 22న నల్గొండ, 23న రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయాల్లో రైతుల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించనున్నట్లు షెడ్యూల్‌ను రూపొందించారు. రైతుభరోసాపై విధివిధానాల ఖరారు కోసం రైతు సంఘాలు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. అన్నిజిల్లాల్లో అభిప్రాయాలు సేకరించి, త్వరలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నామని తెలిపారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా స్పందించారు. గత ప్రభుత్వం ఏ స్కీమ్ చేపట్టినా ప్రజల అభిప్రాయాలు తీసుకోలేదన్నారు. నాలుగు గోడల మధ్య నిర్ణయం తీసుకుని ప్రజలపై రుద్దారన్నారు. ప్రభుత్వానికి వచ్చే ప్రతీపైసా ప్రజల నుంచి వచ్చిందేనని, రైతులు ఇచ్చే సూచనలపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటా మన్నారు. అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతుల ఆలోచన మేరకే ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రైతుల అభిప్రాయం తీసుకున్నాకే రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామన్నారు. నిజమైన రైతులకే రైతుభరోసా అందాలని మంత్రి తుమ్మల అన్నారు.ప్రజల ఆలోచనల మేరకు ప్రభుత్వం ముందుకెళ్తుందని తుమ్మల అన్నారు. గతంలో జరిగిన ఆర్థిక నష్టాన్ని ప్రజలు గమనించారని వ్యాఖ్యానించారు. చిన్న, సన్నకారు రైతులకు చేయూత నిచ్చేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. రైతుల అభిప్రాయాల సేకరణ తర్వాతే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని చెప్పారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో జడ్జీల పేర్లు రాయొద్దు

బహిర్గతం చేయొద్దని సూచించింది. అలాగే తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 23కి వాయిదా వేసింది.రాజకీయ నేతలతో పాటు జడ్జిల ఫోన్లు ట్యాప్ చేశారని పత్రికల్లో కథనాలు రావడంతో ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు సుమోటోగా స్వీకరించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం కౌంటరు దాఖలు చేసింది. కేసు విచారణ జరుగుతోందని, నిందితులను అరెస్టు చేసినట్టు కౌంటర్‌లో పేర్కొంది. పలువురు పోలీసు అధికారుల ఫోన్లు సైతం ట్యాపింగ్ చేసినట్టు తెలిపింది. ఈ వ్యవహారంపై బుధవారం మరోసారి హైకోర్టు విచారణ చేపట్టింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో మీడియా కూడా సంయమనం పాటించాలని, ట్యాపింగ్‌కు గురైన జడ్జిల వివరాలను వెల్లడి చేయొద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ పలు రాజకీయ నాయకులు, హైకోర్టు జడ్జీల ఫోన్లు సైతం ట్యాపింగ్ చేసినట్లు పత్రికల్లో వచ్చిన కథనాలు వచ్చాయి. వాటిని సుమోటోగా స్వీకరించిన హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. మరోవైపు ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుల్ని విచారించిన అధికారులు కీలక విషయాలను రాబట్టారు. అందులో హైకోర్టు న్యాయ మూర్తు ల ఫోన్లు కూడా ట్యాప్ చేశామని నింధితులు విచారణలో ఒప్పు కున్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు గురైన జడ్జీల పేర్లు ఎక్కడ వాడొద్దు. వారి ఫోన్ నెంబర్లు, కుటుంబ సభ్యుల పేర్లు, ఫోటోలు బహిర్గతం చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. వాళ్ల వ్యక్తిగత జీవితాల్లోకి వెళ్లి అనవసరంగా రాద్ధాంతం చేయొద్దు అని మీడియా సంస్థలను హైకోర్టు ఆదేశించింది. అనంతరం.. ఈ కేసు విచారణను తెలంగాణ హైకోర్టు జూలై 23కి వాయిదా వేసింది.

### యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

ఆస్పత్రికి తరలించామని, వారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారు జామున 5.15 గంటలకు బీహార్ నుంచి ఢిల్లీ వెళ్తున్న డబుల్ డెక్కర్ బస్సు పాల ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులందరినీ బయటకు తీసి చికిత్స నిమిత్తం సిహెచ్‌సి బంగార్మావుకు తరలించారు. రోడ్డు ప్రమాదంపై ఉత్తం ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించి మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.



## 41 ఏళ్ల తర్వాత ఆస్ట్రియాకు భారత ప్రధాని

**- ఘనస్వాగతం పలికిన ఆ దేశ ఛాన్సలర్ కార్ల్ నెహమ్మెర్**

న్యూఢిల్లీ,(ప్రజా మంటలు): ఆస్ట్రియాతో సంబంధాలను బలోపేతం చేసుకొనే దిశగా భారత్ మరో అడుగు ముందుకేసింది. ప్రధాని మోదీ నేడు ఆస్ట్రియాకు వెళ్లారు.ఆ దేశ ఛాన్సలర్ కార్ల్ నెహమ్మెర్‌తో భేటీ అయ్యారు. మన దేశ ప్రధాని ఒకరు ఆస్ట్రియాకు వెళ్లడం 41 ఏళ్లలో ఇదే తొలిసారి. 1983లో చివరిసారిగా ఇందిరాగాంధీ ఆ దేశాన్ని సందర్శించారు. ప్రస్తుతం ఇరుదేశాలు దౌత్య సంబంధాలు ఏర్పాటుచేసుకొని 75ఏళ్లు పూర్తయినట్లు భారత విదేశాంగశాఖ ఎక్స్ ఖాతాలో పేర్కొంది."అద్భుతమైన స్వాగత ఏర్పాట్లు చేసినందుకు ఛాన్సలర్ కార్ల్ నెహమ్మెర్‌కు ధన్యవాదాలు. ఇరుదేశాలు కలిసి ప్రపంచం కోసం పని చేస్తాయి" అని ప్రధాని మోదీ ఎక్స్‌లో తెలిపారు. ఈసందర్భంగా ఆయనతో కలిసి దిగిన చిత్రాలను షేర్ చేశారు. అంతకుముందు ప్రధాని మోదీకి వియన్నా విమానాశ్రయంలో ఆస్ట్రియా విదేశాంగ మంత్రి అలెగ్జాండర్ స్కాలెన్ బర్గ్ స్వాగతం పలికారు. అనంతరం మంగళవారం రాత్రి (స్థానిక కాలమానం ప్రకారం) ప్రధాని మోదీకి ఛాన్సలర్ కార్ల్ ఆతిథ్యం ఇచ్చారు.ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, ఛాన్సలర్ కార్ల్ అక్కడి వ్యాపారవేత్తలతో కూడా భేటీ కానున్నారు. భారతీయ మూలాలున్న వ్యక్తులతో నేడు వియన్నాలో ప్రధాని భేటీ కానున్నారు.

### చైనా సరిహద్దులో భారీగా బంగారం పట్టివేత

లద్దాఖ్,జూలై10 (ప్రజా మంటలు): భారత్– చైనా సరిహద్దులో అక్రమంగా రవాణా చేస్తున్న 108 కిలోల బంగారాన్ని భద్రతాదళం స్వాధీనం చేసుకొంది. ముగ్గురు వ్యక్తులను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ ఘటన తూర్పు లద్దాఖ్‌లో చోటు చేసుకొంది. ఈనెల 9న తూర్పు లద్దాఖ్‌లో ఇండో– టిబెటన్ బార్డర్ పోలీసు బలగాలు గస్తీ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే స్మగ్లింగ్ గురించి సమాచారం అందడంతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించారు. సోదాలు చేయగా 108 కిలోల బంగారు కడ్డీలతో పాటు రెండు మొబైల్ ఫోన్లు, బైనాక్యులర్, రెండు కత్తులు, చైనాకు చెందిన కొన్ని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐటీబీపీ వెల్లడించింది. ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపింది. ఇందులో ఇద్దరు లద్దాఖ్‌లోని న్యోమా ప్రాంతానికి చెందినవారిగా భద్రతా దళాలు గుర్తించాయి. ఆ ప్రాంతంలో ఇంత భారీ మొత్తంలో బంగారాన్ని స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారి.

## మెడికల్ హబ్‌గా హైదరాబాద్

**- ఇన్నోవేషన్ గ్లోబల్ ఐటీ సెంటర్‌ను ప్రారంభించిన శ్రీధర్ బాబు**



హైదరాబాద్, (ప్రజా మంటలు): మెడికల్ అండ్ లైఫ్ సైన్స్, ఆర్ అండ్ డీ కి హైదరాబాద్ హబ్ గా మారిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. నానాక్ రామ్‌గూడాలో మెడిట్రానిక్ ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్ గ్లోబల్ ఐటీ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ముందంజలో ఉంచడానికి రాబోయే కాలంలో ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్స్ పరిశ్రమలను ప్రోత్సహకాన్ని అందించేందుకు విధాన పరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మెడ్ ట్రానిక్ ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్ గ్లోబల్ సెంటర్ లాంటి మల్టీ నేషనల్ సంస్థలు ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం చేస్తున్న కృషికి నిదర్శనం గా ఈ గ్లోబల్ సెంటర్ నిలిచిందని చెప్పారు. ఈ సంస్థ ద్వారా 60 మిలియన్ డాలర్ల పెట్టుబడితో, 300 ఉద్యోగావకాశాలు రాబోతున్నాయని తెలిపారు. ఫిబ్రవరిలో మొదలు పెట్టి, ఇప్పుడు పెద్ద ఎత్తున పెట్టుబడులను పెట్టబోతోందని వెల్లడించారు. హైదరాబాద్ లో 12 నెలలు అనుకూల వాతావరణం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి కొత్త ఇనిషియేటివ్?తో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారని తెలిపారు. పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే కంపెనీలకు తమ ప్రభుత్వ అన్ని విధాలా ప్రోత్సహం అందిస్తుందన్నారు. హైద్రాబాద్ లో మరిన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## తెలంగాణలో ఎత్తిపోతలే శరణ్యం

**- పెండింగ్ సమస్యలపై పట్టువిడుపులు అవసరం**

**- స్నేహపూర్వకంగా పరిస్కారం కోసం కృషి**

**- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**



నల్లగొండ (ప్రజా మంటలు): చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై రెండు తెలుగు రాష్ట్రాలు సీఎంలు భేటీ అవ్వడం శుభ పరిణామం అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. విభజన సమస్యలపై పంతాలకు పోకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం చేసుకోవాలి అని సూచించారు. నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా చేశారు.రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలు త్వరలోనే పరిష్కరం అవుతాయి అనే నమ్మకం కలిగిందన్నారు. రెండు రాష్ట్రాల సీఎంలు కలవడాన్ని అభివృద్ధి కోణంలో చూడాలి. అందులో రాజకీయకోణం చూడవద్దన్నారు. ప్రతిపక్ష పార్టీలు చేసే బెదిరింపులకు అసలు భయపడవద్దు.. అప్పుడే అభివృద్ధి పనులు చేసుకోగలుగుతం అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఎత్తిపోతల ద్వారా నీటిని తీసుకోవడం తప్ప మినహా మరో మార్గం లేదు. కృష్ణా జలాల విషయంలో న్యాయబద్ధంగా తెలంగాణకు వాటా ఇవ్వడానికి ఏపీ ప్రభుత్వం సహకరించాలి. ఇరిగేషన్ ప్రాజెక్టులు అన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారు. వచ్చే రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ పెండింగ్ పనులు పూర్తి చేస్తే జిల్లాలో సాగు నీటి సమస్యలు తీరుతాయని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. శాసన మండలి రద్దు అనేది అసంబద్ధమైనది. అలాంటి పరిస్థితి ఏం లేదు. 2026లో పునర్విభజన చట్టం అమలయ్యే అవకాశం ఉంది. ఈ చట్టం అమలైతే తెలంగాణలో 34, ఏపీలో 50 సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఆర్థిక పరిస్థితి బాగా లేదని రూ.7 లక్షల కోట్ల అప్పు ఉం దని రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసింది. అనవసర ఖర్చులు తగ్గించుకోవడం మంచిది. రైతుబంధు, రైతు భరోసా కేవలం పది ఎకరాల వరకు ఇస్తే చాలు. సేద్యం చేసే భూ ములకు మాత్రమే రైతుబంధు ఇవ్వాలి. రైతు భరోసా, రైతు రుణమాఫీ అర్హులైన వారికే ఇవ్వాలి. శాసన మండలి చైర్మన్ హోదాలో ఉండి రాజకీయాల గురించి మాట్లాడను. పార్టీ ఫిరాయింపుల విషయంలో గతంలో ఉన్న శాసన మండలి ఛైర్మన్, స్పీకర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారో మేము కూడా అలాగే తీసుకుంటాం. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు చాలా కష్టపడుతున్నారు. జిల్లాలో ఉన్న పెండింగ్ పనులన్నీ త్వరగా పూర్తి అవుతాయని అనుకుంటున్నాం. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం మంచిదే అని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణ డీజీపీగా జితేందర్


ఆయన ఉన్నారు. విజిలెన్స్ అండ్ ఇన్ఫోర్స్మెంట్ డీజీగా ఆదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. నూతన డీజీపీగా నియమితులైన జితేందర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో రైతు కుటుంబంలో జన్మించిన జితేందర్ 1992 ఐపీఎస్ బ్యాచ్ అధికారి. ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. తొలుత నిర్మల్ ఏఎస్పీగా పనిచేసిన అనంతరం బెల్లంపల్లి అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తించారు. అప్పట్లో నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాల ఎస్పీగా ఉన్నారు. తర్వాత ఢిల్లీ సీబీఐలో.., 2004–06 వరకు గ్రేహౌండ్స్‌లో పనిచేశారు. అనంతరం డీఐజీగా పదోన్నతి పొంది విశాఖపట్నం రేంజ్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. అప్పాలో కొంతకాలం పనిచేసి తెలంగాణ ఉద్యమం సమయంలో వరంగల్ రేంజ్ డీఐజీగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ సీఐడీ, ఎంక్వయిరీ కమిషన్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం హైదరాబాద్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా పనిచేశారు. తర్వాత తెలంగాణ శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీగా, జైళ్లశాఖ డీజీగా పనిచేశారు. ప్రస్తుతం హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న ఆయన 2025 సెప్టెంబరులో పదవీవిరమణ చేయనున్నారు. దీంతో తెలంగాణ డీజీపీగా 14 నెలలపాటు కొనసాగే అవకాశం ఆయనకు ఉంది. మరోవైపు ప్రస్తుత డీజీపీ రవి గుప్తాను హోంశాఖలో ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీగా నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం అందిస్తున్న స్కేలు ప్రకారమే ఆయనకు వేతనం అందించనున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగా తెలంగాణ డీజీపీగా నియమితులైన సందర్భంగా సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని జితేందర్ కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసిన డీజీపీకి సీఎం రేవంత్ అభినందనలు తెలిపారు.

## భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుంది

సంబంధాలు ఎంతోకాలంగా ఉన్నవేనని గుర్తుచేసింది. ఉక్రెయిన్ సంక్షోభం వేళ ప్రధాని నరేంద్రమోదీ మాస్కో పర్యటనను పాశ్చాత్యదేశాలు ఆసక్తిగా గమనించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా విదేశాంగ శాఖ, రక్షణ శాఖలు స్పందించాయి."భారత్, రష్యాల మధ్య చాలాకాలంగా ద్వైపాక్షికసంబంధాలు ఉన్నాయి. అమెరికా కోణంలో చూస్తే.. భారత్ వ్యూహాత్మక భాగస్వామే. రష్యాతో వారి సంబంధాలపై మాకు పూర్తి స్పష్టత ఉంది. ఈ వారం నాటో శిఖరాగ్ర సదస్సు జరగనున్న వేళ.. మోదీ పర్యటన చేయడంపై యావత్ ప్రపంచం దృష్టి పెట్టింది" అని పెంటగాన్ ప్రెస్ సెక్రటరీ మేజర్ జనరల్ ప్యాట్ రైడర్ పేర్కొన్నారు.ప్రపంచ దేశాలతో తాము దూరం కాలేదని ఈ పర్యటన ద్వారా పుతిన్ ప్రకటించుకున్నా అందులో ఆశ్చర్యం లేదని ప్యాట్ రైడర్ అభిప్రాయపడ్డారు. యుద్ధానికి వెళ్లాలనే నిర్ణయమే రష్యాను ప్రపంచానికి దూరం చేసిందన్న ఆయన.. దానివల్ల రష్యా ఎంతో మూల్యం చెల్లిస్తోందన్నారు. ఉక్రెయిన్ సంక్షోభానికి సంబంధించి కేవలం రష్యాతోనే కాకుండా జెలెన్‌స్కీతోనూ ఇటీవల మోదీ మాట్లాడారని, శాంతియుత పరిష్కారానికి భారత్ మద్దతు ఇస్తుందనే భరోసా కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు.రష్యాతో భారత్ సంబంధాలపై ఆందోళనలు ఉన్నప్పటికీ వాటిపై తమకు స్పష్టత ఉందని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ పేర్కొన్నారు. ఆ రెండు దేశాల మైత్రి కొనసాగింపుపై తమ ఆందోళనలను భారత్ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని అన్నారు. రష్యాతో భారత్‌కు ప్రత్యేకమైన, వ్యూహాత్మకమైన భాగస్వామ్యం ఉన్న విషయం తెలిసిందే.

# మరోమారు విజృంభిస్తున్న డెంగ్యూ

## పలు జిల్లాల్లో నమోదువుతన్న కేసులు



విజయవాడ/హైదరాబాద్,జూలై10 (ప్రజా మంటలు): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో డెంగ్యూ కేసులు పెరుగు తున్నాయి. ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులు అన్న తేడా లేకుండా కేసులు పెరుగుతున్నాయి. డెంగ్యూ కేసుల న మోదును తెలయి పర్చాలని ఆరోగ్య శాఖ కూడా ఆదేశించినట్లు సమచారం. వర్షా కాలం కావడంతో పాటు ఎక్కడపడితే అక్కడ నీళ్లు నిల్వ ఉంటున్నాయి. అవే ఇప్పుడు.. దోమలకు ఆవాసాలుగా మారనున్నాయి. ముఖ్యంగా డెంగ్యూ దోమలు గుడ్లు పెట్టేందుకు ఇదే సరైన సమయం. నిలిచిన నీరు, అధిక తేమ ఏడిస్ దోమ వృద్ధికి కారణమవుతాయి. ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిలబడకుండా జాగ్రత్తపడాల్సిందే. దీనికితోడు పారిశుధ్యం సక్రమంగా సాగడం లేదు. కాలం మారుతోన్న కొద్ది డెంగ్యూ కూడా మరింతగా బలోపేతం అవుతోదని, మరింత ప్రమాదకరంగా మారుతోందని డాక్టర్లు చెబుతున్నారు. డెంగ్యూ వస్తే జ్వరం ముదిరి రక్తంలో క్రమేనా ప్లేట్‌లెట్స్ పడిపోవడం మొదలవుతుంది. వెంటనే హాస్పిటల్‌లో జాయిన్ కానట్లయితే.. ప్రాణాలకే ముప్పు. అయితే, ఈ వైరల్ ఫీవర్ మనకు తెలియకుండానే మరో నష్టాన్ని కలిగిస్తోంది. నరాల సంబంధిత సమస్యలను కలిగిస్తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు కేరళ, కర్ణాటక, ఢిల్లీ, ఒడిశా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో కేసులు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వైద్య నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం.. డెంగ్యూ సాధారణ ఫ్లూ లక్షణాలను కలిగి ఉన్నా.. అది నాడీ సంబంధిత సమస్యలను కలిగిస్తుంది. ఎన్సెఫాలిటిస్, మెనింజైటిస్, మైలిటిస్.. మెదడు, వెన్నుపాము వాపుకు కారణమవుతాయి. ఫలితంగా డెంగ్యూ రోగులు తరచు తలనొప్పితో బాధపడతారు. అలాగే వారి మానసిక స్థితిలో కూడా మార్పులు వస్తాయి. కొందరు కోమాలోకి జారుకోవచ్చు. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గినప్పుడు శరీరంలోని వివిధ భాగాల్లో రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంది. చివరికి మెదడులో కూడా రక్తస్రావం జరిగి.. పరిస్థితి మరింత దిగజారే ముప్పు ఉంది. కాబట్టి, డెంగ్యూను తేలిగ్గా తీసుకోవద్దు. ఇంట్లోనే ట్రీట్మెంట్ చేసుకోవచ్చులే అనుకోవద్దు. డెంగ్యూ రోగిని హాస్పిటల్‌లో చేర్చి డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచడం చాలా మంచిది. డెంగ్యూ సోకిన రోగిలో ప్లేట్‌లెట్స్ చాలా వేగంగా తగ్గిపోతుంటాయి. ప్లేట్‌లెట్స్ వరకు తగ్గినట్లయితే.. తప్పకుండా హాస్పిటల్‌లో జాయిన్ కావాలి. ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోతే.. శరీరంలో రక్తస్రావం ఏర్పడుతుంది. జ్వరం వచ్చి తగ్గుతున్నట్లయితే తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు. డాక్టర్ సూచన మేరకు రక్తం, ప్లేట్‌లెట్స్‌ల పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలి. ఒక వేళ ప్లేట్ లెట్స్ సంఖ్య తగ్గుతున్నట్లు రిపోర్టులో తేలితే.. మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వం కూడా డెంగ్యూపై అప్రమత్తం కావాల్సి ఉంది.

# రాజకీయాల కోసం రెచ్చగొడుతున్న బిఆర్ఎస్

**వారికి ఉద్యోగాలు రావడం ఇష్టం లేదా**

**మీ హయాంలో ఎందుకు డిఎస్సీ నిర్వహించలేదు**

**ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం విమర్శలు**



హైదరాబాద్,జూలై10 (ప్రజా మంటలు): స్వార్థ రాజకీయాల కోసం బీఆర్ఎస్ నేతలు విద్యార్థులను రెచ్చగొడు తున్నారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం అన్నారు. బీఆర్ఎస్ నేతలు గాదరి కిశోర్, బాల్క సుమన్ పరుశ పదజాలంతో కాంగ్రెస్ ప్రభుత్వం మీద విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్కనాడు కూడా జాబ్ క్యాలెండర్‌ను ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. తాము బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తమపై కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. గత పదేళ్లలో ఒక్కసారి కూడా డీఎస్సీ నోటిఫికేషన్ ఎందుకు వేయలేదని నిలదీశారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో ప్రీతం మాట్లాడుతూ.. ఇపుడు తాము నోటిఫికేషన్ వేస్తే బీఆర్ఎస్ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ్ర÷ర్ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి మీద పరుషంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మాజీ సీఎం కేసీఆర్ సిగ్గు లేకుండా దళితులను ముందు పెట్టి మాట్లాడిస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన ఎంగిలి మెతుకుల కోసం కొందరు మాట్లాడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగుల గురించి మాట్లాడటానికి బీఆర్ఎస్‌కి నైతిక అర్హత లేదని చెప్పారు.రేవంత్ వచ్చాక నిరుద్యోగులకు స్వేచ్ఛ వచ్చిందన్నారు. ధర్నాలు చేస్తున్న వాళ్లు కనీసం ఉద్యోగం కోసం దరఖాస్తు కూడా చేయలేదని అన్నారు. డబ్బులు ఇచ్చి పెయిడ్ ఆర్టిస్టులతో మాట్లాడిపిస్తు న్నారని ధ్వజమెత్తారు. ఇలాగే చేస్తే బట్టలూడదీసి ఉరికేయాల్సి వస్తదని హెచ్చరించారు. తన పదవి, రాజకీయం వదిలి నీ ముందుకు వస్తానని సవాల్ విసిరారు. 'బరిగే పడతాం, మీ ముందుకు వస్తాం. దొర దగ్గరే ఉండాలా? ఉద్యోగాలు రావద్దా? ఉద్యోగాలు వస్తున్నాయి అంటే మీకు కడుపులో మంట' అని ప్రీతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



**నేడు డీఎస్సీ హాల్ టిక్కెట్ల విడుదల**

హైదరాబాద్ (ప్రజా మంటలు): రాష్ట్రంలో డిఎస్‌సి పరీక్షలు యథా తథంగా షెడ్యూల్ ప్రకారం నిర్వహిం చేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది.ఈ మేరకు గురువారం సాయంత్రం డిఎస్‌సి హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నది. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో డిఎస్‌సి పరీక్షలు జరుగనున్నాయి. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న డిఎస్‌సి -2024 పరీక్షలు ఈనెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. తొలి సారి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) విధానంలో డిఎస్‌సి పరీక్ష జరగను న్నది. రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించ నున్నట్లు డిఎస్‌సి పరీక్ష నిర్వహించ నున్నారు. ఈ మేరకు ఇటీవల సబ్జెక్టుల వారీగా పరీక్షల తేదీలను ప్రకటించారు. డిఎస్‌సి 2024 ఆన్‌లైన్ దరఖాస్తు పక్రియ మార్చి 4న ప్రారంభంకాగా? గత నెల 20వ తేదీతో గడువు ముగిసింది. ఈ ఉద్యోగాలకు మొత్తం 2,79,966 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

# వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోండి

**- వారంలోగా నిపుణుల కమిటీ వేయండి - జీహెచ్ఎంసికి హైకోర్టు ఆదేశం**



హైదరాబాద్ (ప్రజా మంటలు): హైదరాబాద్‌లో వీధి కుక్కల నియంత్రణపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కుక్కల నియంత్రణకు వారంలోగా నిపుణుల కమిటీ వేయాలని జీహెచ్ఎంసీని ఆదేశించింది. ఉదాసీనంగా వ్యవహరించేవారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేసింది. వీధి కుక్కల దాడిలో బాలుడి మృతిపై దాఖలైన పిల్‌పై ఉన్నత న్యాయస్థానం బుధవారం విచారణ జరిపింది. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీకి ఆదేశాలు జారీ చేసి.. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. వీధికుక్కల నియంత్రణపై హైకోర్టు కీలక నిర్ణయం తీసుకున్నది. కుక్కల నియంత్రణకు వారంలోగా నిపుణుల కమిటీ వేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, ఉదాశీనంగా వ్యవహరించే వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించింది. పిల్లలతో పాటు జనాలపై కుక్కల దాడుల నేపథ్యంలో ఓ వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయంలో గతంలోనూ హైకోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా మరణాలకు కారణమవుతున్న వీధికుక్కల నియంత్రణకు ఏం చర్యలు తీసుకున్నారంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. తీసుకున్న చర్యలకు సంబంధించి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. వీధికుక్కల నియంత్రణకు సరైన చర్యలు తీసుకోవడం లేదని.. వ్యాక్సినేషన్ చేయడం లేదని.. సరైన ఆహారం లేకపోవడంతో జనాలపై దాడులు చేస్తున్నాయని ఓ వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. గతేడాది ఫిబ్రవరిలో హైదరాబాద్ బాగ్ అంబర్‌పేటలో పాఠశాల విద్యార్థిపై దాడి చేయగా.. మృతి చెందిన విషయం తెలిసిందే. విద్యార్థి మృతి సంఘటనపై పత్రికల్లో వచ్చిన కథనాన్ని హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణలోకి తీసుకుంది. గత నెలలోనూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో బిహార్ వలస దంపతుల ఆరేళ్ల కొడుకుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలో కన్నుమూశాడు. ఆయా ఘటనలపై బెంచ్ ఆందోళన వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించి బాధ్యత తీరిందని భావించొద్దని.. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అనుపమ్ త్రిపాఠి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల అమలుకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే.

## చెరువులో పడి విద్యార్థి..కాపాడబోయి యువకుడు మృతి

అనంతపురం,జూలై10 (ప్రజా మంటలు): బహిర్భూమికి వెళ్లి చెరువులో పడిన విద్యార్థితో సహా అతని కాపాడబోయిన యువకుడు కూడా మృతి చెందారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండల కేంద్రం నందు ఉన్న జెడ్.పి.హెచ్ స్కూల్లో 6వ తరగతి చదువుతున్న విష్ణు(11) బహిర్భూమికి వెళ్లాడు. దగ్గరలో ఉన్న చెరువులో జారిన చెప్పులు తీయబోయి ప్రమాదవశాత్తు దానిలో పడిపోయాడు. ఇది గమనించిన యువకుడు కంసాల నవీన్ (25) విద్యార్థిని కాపాడబోయి ఇతను కూడా ఊబిలో ఇరుక్కున్నాడు. ఈ విషయాన్ని మిగిలిన విద్యార్థులు వెంటనే అక్కడ ఉన్న స్కూల్ టీచర్ చెప్పడంతో గ్రామస్తులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. అప్పటికే యువకుడు నవీన్ మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న విష్ణును హాస్పిటల్లో చేర్చారు. విష్ణు చికిత్స పొందుతూ మృతి చెందారు.

## టీడీపీ కార్యకర్త గొల్ల ఆదెప్ప హత్య బాధాకరం

**హత్యా రాజకీయాలను వదలని వైకాపా: పల్లా విమర్శలు**

అమరావతి,జూలై10 (ప్రజా మంటలు): ఎన్నికల్లో ఓడినా హత్యా రాజకీయాలను వైసిపి వీడలేదని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం మెచ్చిరిలో టీడీపీ కార్యకర్త గొల్ల ఆదెప్ప హత్య బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. కర్ణాటక వెళ్లి తిరిగివస్తున్న ఆదెప్పను అడ్డుకున్న వైసీపీ కార్యకర్తలు అతనిపై కత్తులతో దాడి చేసి నరికి చంపారని వెల్లడించారు. యథా లీడర్ తథా క్యాడర్ అన్నట్టు జగన్మోహన్ రెడ్డి బాటలోనే వైసీపీ రౌడీ మూకలు పయనిస్తున్నారన మండిపడ్డారు. అరాచకపాలనను భరించలేక ప్రజలు ఛీకొట్టినా జగన్మోహన్ రెడ్డి మరణశాసనం రాస్తూనే ఉన్నారని ధ్వజమెత్తారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకూ 9 మంది టీడీపీ కార్యకర్తలను పొట్టనపెట్టుకున్నారని తెలిపారు. గ్రామంలో ఆలయ అర్చకత్వం విషయంలో ఆదెప్పతో గొడవ పడిన వైసీపీ కార్యకర్తలు అతనిపై కక్ష పెట్టుకుని మాటు వేసి హతమార్చారని పేర్కొన్నారు. మృతుని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని, ఆదెప్ప కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని శ్రీనివాసరావు యాదవ్ ప్రకటించారు.

## ఆగస్టు 15 నాటికి మోరంపూడి ప్లైఓవర్ పూర్తి

**నిర్మాన పనులను పరిశీలించిన ఎంపి దగ్గుబాటి**

రాజమండ్రి,జూలై10 (ప్రజా మంటలు): తూర్పుగోదావరి జిల్లా మోరంపూడి ప్లైవోవర్ వంతెన నిర్మాణ పనులను ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ... మోరంపూడి ప్లైవోవర్ వంతెన నిర్మాణం కోసం మాజీ ఎంపీ మురళీమోహన్ కృషి చేశారని గుర్తుచేశారు. గత ఎంపీ మార్గాని భరత్ వంతెన నిర్మాణం కోసం కృషి చేసినట్టు అబద్ధ ప్రచారం చేసుకున్నారని మండిపడ్డారు. ప్రచారం కోసం శిలాఫలకం ఏర్పాటు చేసుకొని ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. ఆగస్టు 15 నాటికి మోరంపూడి ప్లైవోవర్ పనులను పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకువస్తామని ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే మోరంపూడి ప్లైవోవర్ వంతెన కోసం కృషి చేశాను. మోరంపూడి సెంటర్‌లో జరిగిన ప్రమాదాలను అప్పటి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకువెళ్ళి వంతెన నిర్మాణ పనులు మంజూరు చేయించాను. వైసీపీ ఎంపీ మార్గాని భరత్ వంతెన నిర్మాణ పనులు ఆయనే మంజూరు చేయించినట్టు ప్రచారం చేసుకోవటం సరికాదు. వంతెన నిర్మాణ పనులు నేను మంజూరు చేయించిన విషయం కేంద్ర మంత్రికి, రాజమండ్రి ప్రజలకు తెలుసని మాజీ ఎంపీ మురళీ మోహన్ వెల్లడించారు.

## కేతిరెడ్డి ఓటమిపై కెటిఆర్ విమర్శలు

**మంత్రి సత్యకుమార్ ఘాటుగా ప్రతిస్పందన**

**ధరణిలాగే ఇక్కడా మీ నేతం భూ కబ్జాలు అంటూ విమర్శలు**

అమరావతి,జూలై10 (ప్రజా మంటలు): ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి ఓడిపోవడంపై బాధను వ్యక్తం చేసిన బిఆర్ఎస్ కెటిఆర్ తీరుపై ఏపీ మంత్రి సత్యకుమార్ ఘాటు విమర్శలు చేశారు. మీరు ధరలణిలో భూములు కాజేసినట్లే ధర్మవరంలో ఎమ్మెల్యే కేతిరెడ్ఇ గుడ్‌మార్నింగ్ పేరుతో భూములను కబ్జా చేశారని అన్నారు. అందుకే ప్రజలు అతడిని ఓడిస్తే కెటిఆర్‌కు ఏమొచ్చిందని అన్నారు. ఈ ఇద్దరి మధ్య భూ అనుబంధం ఉందా అని ప్రశ్నించారు. అయితే ఈ విషయంలో మంత్రి సత్యకుమార్ సెటైర్లు, ఆయనను మాజీ మంత్రి కేటీఆర్ బ్లాక్ చేయడం.. రెండు తెలుగు రాష్ట్ర జకీయాల్లో హాట్ టాపిక్‌గా నిలిచింది. ఏపీ ఎన్నికల్లో జగన్ ఓటమి, ధర్మవరంలో కేతిరెడ్డి ఓడిపోవడంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి సత్యకుమార్ సెటైరికల్ కామెంట్స్ చేశారు. దీంతో ఆయన ఎక్స్ అకౌంట్‌ను కేటీఆర్ బ్లాక్ చేసేశారు. ఏపీలో వైఎస్సార్పీపీ ఓడిపోవడం తనకు ఆశ్చర్యాన్ని కలిగించిందని.. అలాగే నిత్యం ప్రజల్లో ఉండే కేతిరెడ్డి ధర్మవరంలో ఎలా ఓటమి చెందారనేది అర్థం కావడం లేదంటూ కేటీఆర్ మీడియాకు తెలిపారు. దీనిపై ఏపీ మంత్రి సత్యకుమార్ స్పందిస్తూ.. తనదైన శైలిలో కేటీఆర్‌పై మాటల దాడికి దిగారు. దీంతో ఏపీ మంత్రి వ్యాఖ్యలను తట్టుకోలేక మాజీ మంత్రి కేటీఆర్ ఏకంగా ఆయన ట్విట్టర్ అకౌంట్‌ను బ్లాక్ చేసేశారు. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే ఓటమి పై తెలంగాణా మాజీ మంత్రి కేటీఆర్ చిలక పలుకులు పలుకుతున్నారు.. ధరణి పేరుతో తెలంగాణలో మీరు నడిపిన భూమాఫియా లాగానే ధర్మవరంలో గుడ్ మార్నింగ్ పేరుతో మీ భూభకాసుర మిత్రుడు ప్రభుత్వ, అసైన్డ్, ప్రైవేటు, ప్రజలు ఆస్తులను ఆక్రమించాడు. చివరికి చెరువులు కొండలను కూడా కబళించాడు. గుడ్ మార్నింగ్ అంటే ప్రజలకు గుర్తుకు వచ్చేది కబ్జా-కలెక్షన్-కరప్షన్-కమిషన్లే. ఫాంహౌస్‌కు పరిమితమైన మీరు ఎక్స్‌లో అడిగినా ధర్మవరం ప్రజలు సమాధానం చెబుతారు. మీ అవినీతిని ప్రశ్నిస్తూ నిర్మాణాత్మక విమర్శ చేసినందుకు ట్విట్టర్‌లో నాలుగు సంవత్సరాల క్రితం నన్ను బ్లాక్ చేశారు. ఈ అవినీతి, అహంకారం, అసమర్థతే మిమ్మల్ని మీ ప్రియ మిత్రులు జగన్ కేతిరెడ్డిలను ఓడించాయి. ఒకే జాతి పక్షులు ఒకరికొకరు 'సర్టిఫికేట్' లు ఇచ్చుకుంటూ ఓదార్చుకోండి' అంటూ ఏపీ మంత్రి సత్యకుమార్ ట్వీట్ చేశారు.

# ఉక్రెయిన్‌కు శత్రుదుర్భేద్యంగా చేస్తాం

**- అధునాతన ఏయిర్ డిఫెన్స్ వ్యవస్థలను సరఫరా చేస్తాం - నాటో సదస్సులో బైడెన్**



న్యూయార్క్ (ప్రజా మంటలు): రష్యా భీకర దాడులతో అల్లాడిపోతున్న ఉక్రెయిన్‌కు తాము ఐదు వ్యూహాత్మక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను సరఫరా చేస్తామని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ప్రకటించారు.వాషింగ్టన్‌లో జరుగుతున్న నాటో దేశాధినేతల సదస్సు ప్రారంభోపన్యాసంలో ఆయన ఈవిషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం ఈ సైనిక కూటమి ఎన్నడూ లేనంత శక్తిమంతంగా ఉందని ఆయన అభివర్ణించారు. అదే సమయంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇప్పుడు పెనుమార్పు చోటుచేసుకొనే దశను ఎదుర్కొంటోందని తెలిపారు. ఉక్రెయిన్‌కు పేట్రియాట్, ఇతర ఆయుధ వ్యవస్థలను సరఫరా చేసేం దుకు జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, రొమానియాతో కలిసి పనిచేస్తామని బైడెన్ వివరించారు. ఈ యుద్ధం త్వరలోనే ముగుస్తుందని బైడెన్ జోస్యం చెప్పారు. ఉక్రెయిన్ కచ్చితంగా సురక్షితంగా ఉంటుందని.. రష్యాకు మాత్రం రక్షణ లేదని వ్యాఖ్యానించారు. 13 నిమిషాలపాటు బైడెన్ ఎటువంటి తడబాటు లేకుండా ప్రసంగించారు. ఈ సదస్సుకు 32 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఉక్రెయిన్‌లో అమాయక ప్రజల మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో బైడెన్ ఈ నిర్ణయం తీసుకొన్నారు. దీనిప్రకారం ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతోపాటు.. వ్యూహాత్మకమైన యాంటీ ఎయిర్ బ్యాటరీస్‌ను నాటో కీవ్‌కు సరఫరా చేయనుంది.గత కొన్ని నెలలుగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పశ్చిమదేశాలను ఆయుధాల కోసం పలుమార్లు అభ్యర్థించారు. ఇటీవలే రష్యా క్షిపణి ఒకటి రాజధాని కీవ్‌లోని పిల్లల ఆసుపత్రిని ధ్వంసం చేసిన రెండ్రోజుల్లోనే ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. యుద్ధం మొదలైన నాటినుంచి జరిగిన అతి ఘోరమైన దాడిగా దీనిని ఆ నగర మేయర్ అభివర్ణించారు. ఒక్క సోమవారం రోజే రష్యా చేసిన దాడుల్లో 43 మంది ప్రాణాలు కోల్పోయారు.

# “జనాభా నియంత్రణపై అవగాహన అవసరం”

## జూలై 11... ప్రపంచ జనాభా దినోత్సవం





రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

రోజు రోజుకు పెరుగి పోతున్న జనాభా, తద్వారా తలెత్తే దుష్పరిణామాలను వివరించేందుకు, సమస్యలపై అవగాహన కలిగించేందుకు ఏటా జులై 11 న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల, తగ్గుదలకు సంబంధించిన విషయాలుపై ప్రజలలో చైతన్యం కలిగించడానికి ఐక్యరాజ్య సమితి 1989లో దీనిని ప్రారంభించింది. 11-07- 1987న జన్మించిన ఒక శిశువుతో ప్రపంచ జనాభా 500 కోట్లకు చేరింది. ఆరోజునే ప్రపంచ జనాభా దినంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. 1989 నుండి జులై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవంగా పాటిస్తున్నారు. ప్రపంచ జనాభాలో 40 శాతం మూడవ ప్రపంచ దేశాలైన ఇండియా, చైనాలలోనే ఉన్నారు. ప్రపంచ జనాభా ప్రతి సంవత్సరం 9 కోట్ల 20 లక్షలు అదనంగా పెరుగుతోంది. క్రీస్తు శకం 1000వ శతాబ్దంలో ప్రపంచ జనాభా కేవలం 40 కోట్లు మాత్రమే. 1850లలో మొదటిసారి జనాభా వందకోట్లను దాటింది. అక్కన్నించి కేవలం 150 ఏళ్ల కాలంలోనే 650 కోట్లను దాటేసింది. వచ్చే యాభై ఏళ్లలో 900 కోట్లకు చేరుకుంటుందని అంచనా.

ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం 2024 కల్లా భారత్, చైనాల జనాభా 1.44 బిలియన్లుగా ఉంటుంది. అప్పటికే చైనా జనాభాను మించుతుంది. భారత దేశంలో 1872 నుంచి 2011 వరకు మొత్తం 15 పర్యాయాలు జనగణన చేశారు. 2011లో 15వ సారి 28 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనగణన నిర్వహించారు. అప్పటికి తెలంగాణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఉంది. భారతదేశంలో తెలంగాణ 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత జనగణన ఒక్కసారి కూడా చేపట్టలేదు.

2011 గణాంకాల ప్రకారం భారతదేశ జనాభా 1,21,05,69,573.

తెలంగాణ రాష్ట్ర జనాభా 3,51,93,978. తెలంగాణ ప్రస్తుత జనాభా 3,50,03,674. ఖమ్మం జిల్లాలో 327 గ్రామాలను (7 మండలాలు) ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు.2001-11లో భారతదేశ జనాభా వృద్ధిరేటు 17.7 శాతం..రాష్ట్రంలో 2001-11 మధ్య కాలంలో జనాభా వృద్ధిరేటు 13.58 శాతం. 2011 లెక్కల ప్రకారం భారత్‌లో సగటు పట్టణ జనాభా శాతం 31.2 ఉండగా, రాష్ట్రంలో పట్టణ జనాభా శాతం 38.67గా ఉంది. అంటే రాష్ట్ర పట్టణ జనాభా జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉన్నట్లు గమనించవచ్చు. రాష్ట్రంలో గ్రామీణ జనాభా ప్రస్తుతం 213.95 లక్షల మంది. రాష్ట్ర మొత్తం జనాభాలో గ్రామీణ జనాభా వాటా ప్రస్తుతం 61.12 శాతం.

2020 మార్చి నాటికి ప్రపంచ జనాభా7.8 బిలియన్ల కు చేరినట్లు అంచనా. 2023 వరకు 8 బిలియన్లకు, 2037 వరకు 9, మరియు 2055 వరకు 10 బిలియన్ల కు చేరనున్నట్లు అంచనా. యునైటెడ్ నేషన్స్ డాటా ప్రకారం 2020 జూలై 9 నాటికి భారత జనాభా 1,380,270,828 ఉన్నట్లు అంచనా. అంటే ప్రపంచ జనాభాలో ఇది 17.7%.పెరుగుతున్న జనాభాలో అభివృద్ధి చెందుతున్న దేశాలు కీలకపాత్ర పోషిస్తున్నట్టు ఈ సందర్భంగా ఐక్య రాజ్య సమితి అభిప్రాయ పడింది. భారత్, అమెరికా, చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్ తదితర తొమ్మిది దేశాలు వచ్చే 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం శాతాన్ని ఆక్రమిస్తాయని సమితి తెలిపింది.

ప్రపంచ జనాభా మొత్తంగా అడ్డూ అదుపూ లేకుండా పెరిగి పోతోంది.

తీర్చగలిగే సంపద, సేవలు, సరుకులు అంతరించి పోతున్నాయి. పర్యవసానం జన విస్ఫోటనం. ప్రజలు భూమికి భారమై, శాపమై పోతున్నారు. కనుకనే దేశాల మధ్య జల, జన యుద్ధాలు, ఆధిపత్య పోరాటాలు, భూమి, సహజ సంపదలను దోచుకోవడాలు, దాచుకోవడాలు జరుగు తున్నాయి. జనాభా పెరుగుదల ఆహార పదార్థాల ఉత్పత్తి పెరుగుదల కంటే చాలా ఎక్కువగా ఉంటోంది. అందువల్ల డిమాండ్ అధికంగా పెరిగి సప్లై తగ్గుముహం పట్టడంతో ధరలు పెరిగి పోతున్నాయి. డిమాండ్, సప్లయిల మధ్య అగాధం పెరిగి పోతోంది. పర్యవసానంగా ఉన్నవాడు కొనుక్కో గలుగు తున్నాడు. లేనివాడు ఆకలికి గురి అవుతున్నాడు. కనుక ప్రపంచంలో అనేకచోట్ల ఆకలి చావులు సంభవిస్తున్నాయి.

మన దేశం జనాభా పెరుగుదల ఇదే రీతిలో కొనసాగితే 2025 నాటికల్లా భారత్ చైనాను అధిగమించి ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశంగా ఆవిర్భవించడం తథ్యం అని అమెరికా గణన సంస్థ వెల్లడించింది. సత్వరమే భారత్ దిద్దుబాటు చర్యలు, జనస్థిరీకరణ, నియంత్రణకు పూను కోకుంటే... ఆఫ్రికా దేశాల మాదిరి ఆకలి, దారిద్ర్యము, కరువు రక్కసులు పడగలు విప్పడం అనివార్యం అనడంలో సందేహం అక్కర లేదు.

# భాష పై పట్టు కోల్పోతున్న నేటి యువత

### మాతృభాషలో పొరపాట్లు - ఆంగ్ల భాషతో అగచాట్లు



మానవుడు అనాగరిక దశ నుంచి నాగరికుడిగా రూపాంతరం చెందడంలో మానవుడు సృష్టించిన భాష కీలక పాత్ర పోషించిందనడంలో సందేహం లేదు. మానవులు తమ ఆలోచనలను, భావవేశాలను సంజ్ఞలు ద్వారా వ్యక్తీకరించే దశ నుంచి ఒక భాష ద్వారా వ్యక్తపరచుకునే పరిపక్వతను సాధించిన తరువాత, మానవుల మధ్య సంబంధాలు మెరుగుపడి వారి అభివృద్ధి మొదలైంది.

**భాష ఒక దివ్య సృష్టి**

మనిషి మనసులోని భావాలను ఎదుటివారికి అర్థం అయ్యేటట్టుగా మాటల రూపంలో చెప్పడానికి అలాగే ఎదుటివారి భావాలను మాటల రూపంలో విని అర్థం చేసుకోవడానికి భాష ఉపయోగపడుతుంది. ఒక విషయం మాట్లాడడానికి, చదవడానికి, వ్రాయడానికి మరియు వినడానికి భాష అనేది చాలా ప్రధానం. భాష తెలిసి ఉండడం వలన ఒక విషయం గురించి కూలంకషంగా అధ్యయనం చేయవచ్చును.సైగల ద్వారా మనిషి మనసులోని భావాలను వ్యక్తం చేయడం కూడా ఒక భాషే.యావత్తు ప్రపంచ మానవాళిని అనుసంధానం చేయగల దివ్యమైన సృష్టి ఈ భాష.

**ఉగ్గుపాల మాతృభాష**

పుట్టిన బిడ్డ అమ్మ ఒడిలో ఉగ్గుపాలతో పాటు అమ్మ నేర్పే భాషను నేర్చుకుంటుంది. ఉగ్గుపాలతో పాటు అమ్మ నేర్పిన భాషనే మాతృభాష అంటారు.అలాగే, ఆ బిడ్డ ఎదిగే కొద్ది తన చుట్టూ ఉన్న ప్రపంచంతో తన ఆలోచనలను అనుసంధానం చేసుకొని అభివృద్ధిని సాధించడానికి అవసరమైన ప్రామాణిక భాషలను నేర్చుకోవలసిన ఆవశ్యకత ఉంటుంది. ఒక వ్యక్తి ఏ భాషనైనా నేర్చుకోవడానికి పునాది మాతృభాషే. అలాంటి మాతృభాషను నేర్చుకునే దశలో పొరపాట్లు జరిగితే ఆ వ్యక్తి మరే ఇతర భాషలోనూ పరిపూర్ణత సాధించలేడని చెప్పడంలో అవాస్తవం లేదు.

**ప్రపంచీకరణ భాష**

ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో అర్హతలు ఉన్న వారెవరైనా ప్రపంచంలో ఎక్కడికెళ్లైనా ఉద్యోగాన్ని సంపాదించి హాయిగా జీవించవచ్చు. అయితే నేటి ప్రపంచంతో పోటీ పడాలంటే ప్రపంచంలో సుమారు 60కి పైగా దేశాల్లో 135 కోట్లకు పైగా ప్రజలు మాట్లాడుతున్న “యూనివర్శల్ లాంగ్వేజ్”ఆంగ్ల భాషను ముందుగానే నేర్చుకోవలసిన ఆవశ్యకత ఉంది.ఈ కారణం చేతే విద్యార్థులు ప్రాథమిక విద్య నుంచే ఆంగ్ల మాధ్యమంలో చదువుతూ, మాతృభాషను మొక్కుబడిగా చదువుతున్నారు. కానీ ప్రాథమిక విద్య నుండి డిగ్రీ విద్య వరకు ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్నా, విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించకపోగా మాతృభాషపై కూడా పట్టును కోల్పోతున్నారు.

**భాషతో అగచాట్లు-కారణాలు**

ప్రాథమిక విద్య నుంచి నేర్చుకుంటున్నా కూడా, ఆంగ్లభాష పై పట్టు సాధించలేక పోవడానికీ మరియు మాతృభాషపై పట్టు కోల్పోవడానికీ అనేక కారణాలున్నాయి. విద్యార్థులు ఈ భాషలకు సంబంధించిన కోర్సులను నేర్చుకునే సమయంలో వాటిని కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత కోసం చదివే కోర్సులుగానే పరిగణించడం ఒక ముఖ్య కారణం. మరో బలమైన కారణం ఏమిటంటే, విద్యార్థులు ప్రాథమిక విద్య నుండి మాతృభాషలో గానీ మరే ఇతర భాషలో గానీ వినడం, మాట్లాడడం, చదవడం మరియు వ్రాయడం వంటి మంచి భాషా సంస్కృతి(కల్చర్ అఫ్ లాంగ్వేజ్) అలవర్చుకోకపోవడం. అలాగే, మనిషి అభివృద్ధికీ భాషకూ మధ్య ఉన్న సహసంబంధాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలాగా వివరించ లేకపోవడం వేరొక కారణం.

**భాషకు పునాది**

మనిషి లోని వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించేది భాషే. భాష పై పట్టు సాధించని వ్యక్తి తనలోని సృజనాత్మక శక్తిని ప్రపంచానికి పరిచయం చేసుకోలేడు. అందుకే ప్రాథమిక విద్య నుండే తప్పనిసరిగా అమ్మ నేర్పిన కమ్మని మాతృభాషలో విద్యార్థులకు గట్టి పునాది వెయ్యాలి. ఆ పునాదే ఇతర ప్రామాణిక భాషలను నేర్చుకోవడానికి ఆసక్తిని కలిగిస్తుంది. మాతృభాషలో పటిష్టమైన పునాది ఉన్న ఏ విద్యార్థైనా ఇతర భాషలను చాలా సులువుగా స్పష్టంగా నేర్చుకోగలుగుతాడనేది అక్షర సత్యం.

ఈ కథనానికి ముగింపుగా, ప్రాథమిక విద్య నుండి మాతృభాష మాధ్యమంలో చదవాలా లేదా ఆంగ్ల మాధ్యమంలో చదవాలా అనే మీమాంశ అవసరం లేదు. మన ప్రవృత్తికి మాతృభాష ఎంత అవసరమో మన వృత్తికి నేడు ఆంగ్ల భాష కూడా అంతే అవసరం. అందుకే, మాతృభాషను పునాదిగా చేసుకుని ఆంగ్లభాషను మరియు అవసరమైన ఇతర ప్రామాణిక భాషలను నేర్చుకోవాలి.

భాష ఒక పాఠ్య పుస్తకం కాదు మనిషి అంతరంగానికి ప్రతిరూపం
ప్రపంచాన్ని అనుసంధానించే దివ్య సృష్టి

నసుబోలు రాజశేఖర్,,
తాడేపల్లిగూడెం, 9885739808

## కవిత్వం

### పాలిట్రిక్స్

మేడిపండు చూడ
చందమే నగరాలు,
ఒక్క వర్షమొస్తే చాలు
నిండ నీట మునుగు!

ఏరులై పారుతుండు
రోడ్లపైన డ్రైనేజీ కంపు,
నగుబాటుగా నవ్వుకునే
ఫ్లైఓవర్లు చూసి ఆ ముంపు !

-న్యాలకంటి నారాయణ
9346200066

### కాసేపు మాట్లాడుకుందాం

కాసేపు
మాట్లాడుకుందాం
రాత్రి రాలిపడిన
నక్షత్రాలన్ని ఏరుకుంటూ
తొలి భానునికి స్వాగతం
పలుకుతూ...
నాకు నువు నీకు నేను
అవగతం అయ్యేందుకు
కాసేపు
మాట్లాడుకుందాం

ఇష్టాలను కష్టాలను
కాలం గోడకి వేలాడదీసి
మనసులోని భావాలను
మనస్ఫూర్తిగా
పంచుకుందాం

లోలోపల బంధించిన
ఆశలను చిగురింపచేద్దాం
అజ్ఞాత కలలను కలిసి
మరోసారి కలగందాం

పోయిన జన్మలో
ఎవరికి ఎవరమో
మరోజన్మ ఉందో లేదో
అందుకే ఈ క్షణం
తనివితీరా ఆస్వాదిద్దాం

ఏకాంతంలో
ఏ కాకులు కాంచని
ప్రకృతి ఒడిలో
కాసేపు సేద తీరుదాం
ఇంకాసేపు
మాట్లాడుకుందాం..!!!

రచన:
శ్రీలత కొట్టె
హృదయస్పందన
జనగామ జిల్లా..

## గురుకులాల సమస్యలను పరిష్కరిస్తాం
## పూర్తికాని భవనాలను పూర్తి చేయిస్తాం

### టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం,జూలై10 (ప్రజామంటలు):

రాష్ట్రంలో గురుకుల పాఠశాలల సమస్యలను పరిష్కరిస్తామని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు.టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తొలిసారిగా ప్రారంభించారని గంటా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం విశాఖపట్నం జిల్లా సింహాచలం అడవివరం సమీపంలోని గురుకుల పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలను ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు. అనంతరం గురుకుల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఆ క్రమంలో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే గంటా భోజనం చేశారు. అనంతరం గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ... గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతులు బాగున్నాయన్నారు. అయితే గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన అదనపు భవనాలు ఇప్పటికీ నిర్మాణ దశలోనే ఉండిపోయాయని తెలిపారు. వీటి నిర్మాణాన్ని గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ఇక వాటి నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. అలాగే గురుకులాల్లోని పలు సమస్యలను సైతం విద్యార్థులు సిబ్బంది తమ దృష్టి తీసుకువచ్చారన్నారు. వాటిని సైతం పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. విద్యారంగానికి గతంలోనే టీడీపీ అధిక ప్రాధాన్యత ఇచ్చిందని.. అదే ప్రాధాన్యతను ప్రస్తుతం కొనసాగిస్తుందని మాజీ మంత్రి గంటా స్పష్టం చేశారు. మరోవైపు టీడీపీ అధినేత, సీఎం నారా చంద్రబాబు నాయుడు గురువారం విశాఖపట్నం వస్తున్నారన్నారన్నారు. ఈ సందర్భంగా గతంలో తాము ఇచ్చిన హామీలను ఆయన దృష్టికి తీసుకువెళ్తామని గంటా శ్రీనివాసరావు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.




## కుందేలు తెలివి



ఒక సింహం రాజు పదవిలోకి రాగానే గర్వంతో రాక్షసంగా నడుచుకొనసాగింది . సింహం రాజుకు కుందేలు మాంసం అంటే చాలా ఇష్టం . రాజు అయ్యాక ప్రతిరోజు కుందేలు మాంసం తినసాగింది .క్రమంగా అడవిలో కుందేళ్ళ సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది.

ఒక రోజు చ్టి కుందేలును సింహం రాజుకోసం పట్టుకొనివెళ్తున్న ఏనుగుకు అడ్డుపడి “ఆ చిట్టికుందేలుకు బదులు నేను వెళ్తాను “ అంది ఒక కుందేలు .

“నాకు కావలసింది కుందేలు ఎవరైతేనేమి” అంటూ చిట్టి కుందేలును విడిచిపెట్టి, ఆ కుందేలును రాజుదగ్గరకు తీసుకెళ్లింది ఏనుగు.

“మహారాజా ఇక ఈ అడవిలో కుందేళ్లు బాగా తగ్గిపోయింది. నన్ను చంపనని హామీ ఇస్తే ప్రతిరోజూ మీకు ఒక కుందేలు దొరికేలా చేస్తాను “ అంది కుందేలు

“నాకు కుందేళ్లు దొరికే ఏర్పాటు చేస్తే నిన్ను చంపను “

“ప్రక్క అడవిలోని సింహం రాజుకు జింక మాంసం అంటే చాలా ఇష్టం .ఇప్పుడు ఆ అడవిలో జింకలు చాలా వరకు తగ్గిపోయింది .మన అడవిలోని జింకలు ఆ సింహానికి ఇవ్వాలంట ,అలాగైతే ఆ అడవిలోని కుందేళ్లు మీకు రహస్యంగా ఇస్తానని చెప్పింది. మూడో జంతువుకు అనుమానం కలగకుండా మీరిద్దరూ కలుసుకొనే ఏర్పాటు చేస్తాను .”

సింహం రాజు సంతోషంతో అంగీకరించింది. పౌర్ణమి రోజు నది ఒడ్డుకు రమ్మనమని చెప్పింది .

అడవిలోనున్ననది ఒడ్డుకు వచ్చి ఎదురుచూడసాగింది .

“కుందేలూ ఎంతసేపని ఇలా ఒంటరిగా ఎదురుచూస్తూ కూర్చోవాలి .విసుగ్గావుంది “

“ సింహం రాజా మీకుపొద్దు పోవడానికి నా దగ్గర ఒక వస్తువు వుంది చూస్తూ వుండండి “ అంటూ అక్కడకు దగ్గరలో దాచివుంచిన స్మార్ట్ ఫోన్ ఇచ్చింది .

“ చాలా రోజులుగా వినడమే కానీ మొదటిసారి సెల్ ఫోన్ చూస్తున్నాను “అంటూ సెల్ ఫోనునందు వీడియో గేమ్స్ ఆడటం ప్రారంభించింది .

కొంత సమయం తరువాత “ మొసలి అంకుల్, మొసలి అంకుల్ ఇప్పుడు మీరు రండి “అంటూ బిగ్గరగా పిలిచింది

రెండు మొసళ్ళు అక్కడకు వచ్చి ప్రక్కనే వున్న సింహాన్ని చూసి వులిక్కి పడ్డాయి.

“ ఏయ్ కుందేలూ, నిన్ను తెలివైన కుందేలు అంటారు . ఇప్పుడు నీవు సింహం ప్రక్కనే నిలబడి అరుస్తున్నావు. నీ తెలివి తెల్లారినట్లేవుంది. అది విన్నదంటే “

“ మొసలి అంకుల్ , స్మార్ట్ ఫోన్ వీడియో గేమ్స్ ఆడేవారు ఆ ఆటలో పూర్తిగా లీనమైపోతారు. ప్రక్కన పిడుగులు పడినా వినలేరు. మానవులలో తమ పిల్లల చదువును, ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఇలాంటి స్మార్ట్ ఫోన్లను ఈ మధ్య తల్లితండ్రులు పారవేస్తున్నారు.సింహాన్ని ఎలా చంపాలి అని ఆలోచిస్తున్న సమయాన నాకు ఈ స్మార్ట్ ఫోన్ దొరికింది. ఈ స్మార్ట్ ఫోన్ వుపయోగించి మీ సహాయంతో ఆ సింహం మరణం చూడవచ్చు అన్న ఆలోచన కలిగింది .ఇప్పుడు మీరిద్దరూ ఆ సింహాన్ని చంపి తినండి. “ అంది

వీడియో గేమ్స్ నందు మునిగిపోయిన ఆ సింహం దగ్గరకు రెండు మొసళ్ళు చెరోప్రక్క వచ్చి ఒక్కసారిగా పట్టుకొనగానే ‘అయ్యో ఈ సెల్ ఫోన్ వీడియో గేమ్స్ వలన ఇవి నా దగ్గరకు రావడం గుర్తించలేక పోయాను.ఇక ఏమీ చేయలేను.నాకు మరణం తప్పదు.”అని బాధగా అనుకొంది

కుందేలు తెలివిని అడవి జంతువులు మెచ్చుకొన్నాయి.

ఓట్ర ప్రకాష్ రావు
తిరుత్తణి, 09787446026



జగిత్యాల జిల్లా సారంగాపూర్ మం. రేచపల్లి శ్రీ జగన్నాథ ఆలయ అభివృద్ధి కొరకు 1,00,000 (లక్ష) రూపాయలు అందజేసిన ప్రముఖ దంత వైద్యులు డా. ఎడమల శైలేందర్ రెడ్డి.



తెలంగాణ డీజీపీగా నియమితులైన జితేందర్ హైదారాబాద్ లోని తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.



## బోనాల పండుగ పోస్టర్ ఆవిష్కరించిన చైర్పర్సన్

జగిత్యాల మేరు సేవా సంఘం ఆధ్వర్యంలో ఆషాఢ మాసం పోచమ్మ బోనాల పండుగ పోస్టర్ ను బల్దియా చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆవిష్కించారు. చైర్పర్సన్ నివాసంలో మేరు సేవా సంఘం కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఆషాఢ మాస పోచమ్మ బోనాల కార్యక్రమానికి వారిని ఆహ్వానించారు.



## సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ, సిబ్బంది వాహన తనిఖీలు

జగిత్యాల జూలై 10 (ప్రజామంటలు): పట్టణంలోని కొత్త బస్టాండ్ చౌరస్తా వద్ద టౌన్ సీఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో హెల్మెట్ లేకుండా, రాష్ డ్రైవింగ్, వాహన పత్రాలు %డ% నంబర్ ప్లేట్ లేని 25 వాహనాలను గుర్తించి సీజ్ చేసిన పోలీసులు. ప్రతి వాహనదారున్ని డ్రంక్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామని, మైనర్లు డ్రైవింగ్ చేసినట్లయితే ఎవరైతే వారికి వాహనం ఇచ్చారో వారిపై కేసు నమోదు చేస్తామని నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సీఐ వేణుగోపాల్ హెచ్చరించారు.

## ఘనంగా గంగమ్మ తల్లి బోనాలు

### హాజరైన మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



జగిత్యాల జూలై 10 (ప్రజామంటలు): జిల్లా కేంద్రంలో బుధవారం గంగమ్మ తల్లి బోనాల కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 10 వ వార్డు నుంచి గంగపుత్ర సంఘం మహిళల ఆధ్వర్యంలో ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని ఊరేగింపు నిర్వహించగా, జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ బోనాల జాతర కార్యక్రమంలో పాల్గొని బోనం ఎత్తుకున్నారు. అనంతరం గంగమ్మ తల్లికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... గంగపుత్రుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అండగా నిలిచిందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ సిరికొండ భారతి, మహిళలు, గంగపుత్ర సంఘం కార్యవర్గ సభ్యులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పారిశుధ్యం మెరుగుపై దృష్టి పెట్టకపోతే చర్యలు తీసుకుంటాం

జనగామ జూలై 10 (ప్రజామంటలు): జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పాఠశాల అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. పాఠశాలలో మరుగుదొడ్ల పారిశుద్ధ్యన్ని పరిశీలిస్తూ మైనర్ రిపేర్ లకు ప్రతిపాదనలు పంపించాలని రోడ్లు భవనాల శాఖ డి.ఈ. ని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాఠశాలలో పారిశుధ్యం మెరుగుపరిచి తక్షణం ఫోటోలను పంపించాలన్నారు.అదే మండలంలోని సముద్రాల గ్రామాన్ని సందర్శించి నర్సరీ నీ పరిశీలించారు. నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం తగదని కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరు వెంట జడ్పీ సీఈవో అనిల్ కుమార్, ఆర్ అండ్ బి డిఈ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కామారెడ్డి జిల్లాలో ఏటీఎం మెషిన్ ఎత్తుకెళ్లిన అంతర్ రాష్ట్ర దొంగల ముఠా

కామారెడ్డి జూలై 10 (ప్రజామంటలు): కామారెడ్డి జిల్లా ఏటీఎంలోకి చొరబడ్డ దుండగులు. ఏకంగా ఏటీఎం మిషిన్‌ను ఎత్తుకెళ్లిన ఘటన కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో నిన్న రాత్రి చోటుచేసుకుంది. ఏటీఎంలో రూ. 3.95 లక్షల నగదు ఉన్నట్టు సమాచా రం. ఘటనా స్థలాన్ని బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ నరేష్ పరిశీలించారు. అర్ధరాత్రి మూడు గంటల ప్రాంతంలో వచ్చిన దుండుగులు కేవలం మూడు నిమిషాల్లోనే ఏటీఎంను ఎత్తుకెళ్లినట్టు సమాచారం. ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారు జామున 3 గంటల 20 నిమిషాల సమయంలో దొంగలు చాకచక్యంగా ఏటీఎంలోకి చొరబడి డబ్బులతో సహా ఏటీఎం మెషిన్‌ను ఎత్తుకెళ్లారు. ఏటీఎంలో రూ. 3 లక్షల 95 వేలు ఉన్నాయని, ఏటీఎంతో సహా దొంగలు ఎత్తుకెళ్లినట్టు బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మోహన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. ప్రధాన కూడలిలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డులను పరిశీలించగా ఏటీఎం ఎత్తుకెళ్లిన దొంగలు మహారాష్ట్ర వైపు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు.



త్వరలోనే దుండగులను పట్టుకుంటామని తెలిపారు. ఏటీ ఎంను ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లిన ఘటనలు చూశాం కానీ ఏకంగా మిషిన్‌ను ఎత్తుకెళ్లిన ఘటన ఇంతవరకు చూడలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

## తహసీల్ చౌరస్తా నుండి టవర్ వరకు గల రోడ్డు మరియు డ్రైన్

### టెండర్ రికాల్ చేసి వెంటనే పనులు ప్రారంభించాలని మున్సిపల్ చెర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మన్ కు వినతి



జగిత్యాల జూలై 10 (ప్రజామంటలు): తహసీల్ చౌరస్తా నుండి టవర్ వరకు గల రోడ్డు గుంతలతో మరియు దుబ్బతో ఆ ప్రాంత ప్రజలు చాల ఇబ్బందులు పడుతున్నారు. టెండర్ రికాల్ చేసి వెంటనే పనులు ప్రారంభించాలని మున్సిపల్ చెర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మన్ కు జగిత్యాల మున్సిపల్ 35 వ వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ వినతి పత్రం సమర్పించారు.. మిషన్ భగీరథ కొరకు తవ్వి దాదాపు మూడు సంవత్సరాల కాలం అయిన నల్లా కనెక్షన్లు ఇవ్వక సంబందిత తవ్విన స్థలంలో ప్యాచ్లు చేయక అక్కడ వర్షం పడినప్పుడు గుంతలలో నీళ్ళు నిలిచి గుంత ఏర్పడ్డక బండ్లు పడిన సందర్భాలు ఎన్నో మరియు వర్షం పడి పోయిన తర్వాత ఆ రోడ్డు పై ఉన్న సన్నపు దుబ్బ షాప్ యజమానులకు, అక్కడ నివసించే ప్రజలకు, దుమ్ముతో' డస్ట్ ఎలర్జీ స్టార్ట్ అయి జలుబు, అస్తమాలాంటి కొత్త వ్యాదులు వస్తున్నాయి. మరియు తవ్విన వాటిని పూర్తి స్థాయిలో పూర్చక పోవడంవల్ల బండ్లు వెళ్ళినపుడు రాళ్ళు ఎగిరి వచ్చి షాప్ అద్దాలు కూడ పగిలినవి, రోడ్డుపై నడిచే ప్రజలకు రాళ్ళు తగలడం లాంటివి జరుగుతున్నాయి. దాదాపు కలెక్టర్లు, అదనపు కలెక్టర్లకు, కమిషనర్లకు, మరియు ఎం.ఎల్.సీ., ఎం.ఎల్.ఎ. ల దృష్టికి తీసుకు వెళ్ళిన ఈ సమస్య పరిష్కారం కావటం లేదు. మీరు ఆ ప్రాంత నివాసి అయిన దృష్ట్యా ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుట కొరకు భగీరథ కనెక్షన్లు ఇప్పించి వెంటనే రోడ్లు వేసినట్లయితే సమస్య కూడ పరిష్కారం అవుతుంది మరియు చౌరస్తా నుండి టవర్ వరకు గల డ్రైనేజీ గత 40 సం,, క్రితం కట్టినది డ్రైన్ వాటర్ రోడ్డు పైకి వచ్చిన సందర్భంలో కచ్చా నాళా కొట్టినాం. కాని, ఆ రోడ్డులో డ్రైన్ కు కనెక్టివిటి చేయక పోయేసరికి ఆ కచ్చా నాళాలో డ్రైన్ వాటర్ ఆగి దోమలు తయారవు తున్నాయి. దిన్ని టెండర్ రికాల్ చేసి వెంటనే పనులు అయ్యే విధంగా చర్యలు తీసుకోగలరని జగిత్యాల మున్సిపల్ 35 వ వార్డు కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ మనవి చేశారు.



## వేములవాడ రాజన్న హుండి లెక్కింపులో పాల్గొన్న చిగురుమామిడి మండల భక్తులు

చిగురుమామిడి జూలై 10 (ప్రజామంటలు): వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో చిగురుమామిడి మండలానికి చెందిన 12 మంది కళాకారులు, భక్తులు దేవస్థానానికి సంబంధించిన హుండి లెక్కింపు సేవా కార్యక్రమానికి స్వచ్ఛందంగా కదలి వెళ్లారు. స్వామివారి సేవలో హుండి లెక్కింపు మరియు అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్నారు అలాగే మండలంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిగురుమామిడి కళాకారుల కమిటీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్, పెనుకుల తిరుపతి, నిలిగొండ కిషన్, సొన్నాయిల భరత్, చందబోయిన వెంకటమల్లు, నడిగొట్టు కిరణ్, కంది రమేష్, కూన సతీష్, నడిగొట్టు సాయి, చల్లారపు చంద్రశేఖర్, లోకిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్,జూలై10 (ప్రజామంటలు): నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో బుధవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. శ్రీదత్తసాయి కాంప్లెక్స్‌లో మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటల ధాటికి కాంప్లెక్స్ అద్దాలు పగిలి రోడ్డుపై పడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిపమాక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలు అదుపుచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీసులు ఆ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.



## కరెన్సీ నోట్లపై అంబేద్కర్ ఫోటో ముద్రించాలని చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



జనగామ జూలై 10 (ప్రజామంటలు): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటోను కరెన్సీ నోట్లపై ముదిరించాలని జులై 29,30,31 తేదీలలో జంతర్ మంతర్ న్యూ ఢిల్లీ లో కరెన్సీ పై జరిగే మహాదర్నా పోస్టర్ ను అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెండవ మనుమడు భీమ్ రావు యస్వంత్ అంబేద్కర్ చేతుల మీదుగా అంబేద్కర్ స్థాపించిన ప్రింటింగ్ ప్రెస్ ముంబయి లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రెండవ మనుమడు భీమ్ రావు యస్వంత్ అంబేద్కర్ మాట్లాడుతూ.... ఈ న్యాయమేనా డిమాండ్ సాధన కోసం సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. జులై 29,30,31 తేదీలలో జంతర్ మంతర్ న్యూ ఢిల్లీ మహాధర్నాకు రాజ్యసభ సభ్యులు, పార్లమెంటు సభ్యులు, రాజకీయ పార్టీల అధ్యక్షులు ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఆహ్వానిస్తున్నామని పరశురామ్ తెలిపారు. కార్యక్రమంలో కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి సాంస్కృతిక విభాగం జాతీయ కన్వీనర్ గట్టగల్ల సంజీవ, మహారాష్ట్ర రాష్ట్ర బాద్యులు మూల్ నివాసి మాలజీ సంటి శంకర్ మహారాజ్, చాంద్ అహ్మద్ షేక్, డా శ్యాం దావన్, డా రోహన్ సరోల్, పిట్టల రాజు, గట్టగల్ల బాబు, చింత శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



జనగామ జూలై 10 (ప్రజామంటలు): విద్యార్థులకు ఉన్నతమైన విద్యతో పాటు నాణ్యమైన పోష్టికాహారాన్ని కూడా అందించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.బుధవారం లింగాల ఘనపూర్ మండలం నవాబుపేట గ్రామంలోని అంగన్వాడీ పాఠశాల, ప్రైమరీ పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. ముందుగా అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి విద్యార్థుల హాజరు పట్టిక ను, పిల్లల మేధాశక్తి ని పరిశీలించారు. పిల్లల ఎత్తు, బరువు ను ఎప్పటికప్పుడు (న్యూట్రిషన్, హెల్త్ ట్రాకింగ్ సిస్టం) యాప్ లో నమోదు చేయాలని కలెక్టర్ అంగన్వాడీ టీచర్లను ఆదేశించారు. వంటగదిని సందర్శించి చిన్నారులకు పౌష్టికాహారం కొరకు అందిస్తున్న ఆహార వస్తువులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను కూడా తనిఖీ చేశారు. అనంతరం ప్రైమరీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో తెలుగు పద్యాలను చదివించారు. గణితానికి సంబంధించిన కొన్ని లెక్కలను వారిచే బోర్డు మీద వ్రాయించి మేధాశక్తి ని పరిశీలించారు. విద్యా బోధనలో వినూత్న పద్ధతులను పాటిస్తే పిల్లలు ఆసక్తి తో వింటారన్నారు. అలాగే పిల్లలందరూ ప్రతిరోజు పాఠశాలకు వచ్చేలా టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నవాబుపేట హైస్కూల్లలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించి వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,సీడీపీఓ రమాదేవి, అంగన్వాడి సూపవైజర్ తదితరులు పాల్గొన్నారు.



## పద్మశ్రీ గ్రహీతలకు 25 లక్షల చొప్పన సాయం

హైదరాబాద్, (ప్రజా మంటలు):

పద్మశ్రీ అవార్డు గ్రహీతలను సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఒక్కొక్కరికి రూ.25లక్షల చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు. చెక్కులు అందుకున్న వారిలో పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గడ్డం సమ్మయ్య , దాసరి కొండప్ప, వేలు ఆనందచారి, కూరేళ్ల విఠలాచార్య, కేతావత్ సోంలాల్ ఉన్నారు. చెక్కులను అందించిన సందర్భంగా ముఖ్యమంత్రికి పద్మశ్రీ అవార్డు గ్రహీతలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఢిల్లీలో ఘనంగా లాల్‌దర్వాజ బోనాలు

### ఉత్సవాల్లో పాల్గొన్న గవర్నర్ రాధాకృష్ణన్

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):



ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. అనంతరం తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. దేవుడు ఒక్కడే అయినా.. భిన్న రూపాల్లో మనమంతా కొలుస్తామన్నారు. అదే సెక్యూలరిజానికి నిజమైన నిర్వచనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ బోనాల ఉత్సవాల్లో ఆ సంస్కృతి స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. తాను రెండోసారి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. బోనాల సందర్భంగా తెలుగు రాష్ట్రాల ప్రజలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ఈ ఉత్సవాలకు హాజరయ్యేందుకు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు వచ్చిన గవర్నర్ రాధాకృష్ణన్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

## ఉచిత ఇసుకతో నిర్మాణ రంగానికి ఊపిరి

### అబద్దాలు ప్రచారం చేస్తోన్న నీలి మీడియా: కాల్వ

అమరావతి,జూలై10(ప్రజామంటలు):

ఉచిత ఇసుక పంపిణీపై నీలిమిడియా దుష్ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. వైసీపీ చేయలేని పనిని సీఎం నారా చంద్రబాబు నాయుడు చేశారని కడుపుమంట పట్టుకుందని విమర్శించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు భకాసురులుగా మారి ఇసుకను వైకాపాసురులు బొక్కారని ఎద్దేవా చేశారు. లోడింగ్, రవాణా ఛార్జీలను మాత్రమే వసూలు చేస్తూ ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఉచిత ఇసుకతో లక్షల మంది కార్మికులకు మేలు కలుగుతుందని అన్నారు.నిర్మాణ రంగానికి ఊపిరి పోశారని ఉద్ఘాటించారు. వైసీపీ అబద్దాలను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అబద్దాలను నమ్ముకున్న వైసీపీ ఖచ్చితంగా ఒక గత చరిత్రగా మిగిలిపోతుందని విమర్శలు చేశారు. వైసీపీ భవిష్యత్ లేని పార్టీ.. ఆపార్టీ కార్యక్రమాలు ఇక ఉండవని చెప్పారు. వైసీపీ నేతలు ఇకనైనా నిజాలు మాట్లాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వంపై విషం చిమ్మటం మానుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో మరిన్ని అద్భుతాలు జరగబోతున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుదిటి రాతను మార్చే శక్తి యుక్తి చంద్రబాబుకే ఉందని కాల్వ శ్రీనివాసులు ఉద్ఘాటించారు.

# నగర శివారులో దారుణం



### ప్రముఖ రియల్ వ్యాపరి దారుణ హత్య

రంగారెడ్డి,జూలై10 (ప్రజా మంటలు):

హైదరాబాద్ సిటీ శివార్లలో ఘోరం జరిగింది. పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారిగా గుర్తింపు పొందిన కమ్మరి కృష్ణను దుండగులు హత్య చేశారు. షాద్‌నగర్ లోని తన ఫాంహౌస్ నుంచి బయటకు వస్తున్న సమయంలో.. ప్రత్యర్థులు కత్తులతో దాడి చేసి.. కిరాతకంగా నరికి చంపారు. కమ్మరి కృష్ణను చంపిన తర్వాత.. అక్కడి నుంచి నిందితులు పరార్ అయ్యారు. 2024, జూలై 10వ తేదీ మధ్యాహ్నం తర్వాత ఈ ఘటన జరిగినట్లు సమాచారం. విషయం తెలిసిన పోలీసులు స్పాట్ కు చేరుకుని విచారణ చేస్తున్నారు. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ హైదర్ షాకోట్ కు చెందిన కమ్మరి కృష్ణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. కన్వెన్షన్ సెంటర్లు, ఫాంహౌస్ నిర్మాణాలు చేస్తూ కేకే గా గుర్తింపు పొందారు. హత్య షాద్ నగర్ సమీపంలోని కమ్మదనంలో ఉన్న తన సొంత కె.కె ఫాంహౌస్ లో ఉండగానే.. నిందితులు రెక్కీ నిర్వహించి.. పక్కా ప్రణాళికతో హత్య చేసినట్లు తెలుస్తోంది. చికిత్స కోసం శంషాబాద్ లోని ట్రైడెంట్ హాస్పిటల్ కు తీసుకు వెళ్తుండగా దారిలో కేకే మృతి చెందాడు. హత్యకు కారణాలు ఏంటీ అనేది ఇంకా స్పష్టంగా బయటకు రాలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో గొడవలా లేక ఆర్థిక లావాదేవీలా లేక వ్యక్తిగత వ్యవహారాల అనేది పోలీస్ విచారణలో తేలాల్సి ఉంది.



## రిటైర్డ్ ఐఏఎస్ ఇంట్లో చోరీ

### 24 గంటల్లో చేదించిన పోలీసులు

### చోరీ సొత్తు రికవరీతో నిందితుడి అరెస్ట్

హైదరాబాద్,జూలై10 (ప్రజా మంటలు):నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో రిటైర్డ్ ఐఏఎస్ ఇంట్లో చోరీ జరిగిన కేసును ఛేదించినట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. ఈనెల 9న బాధితుడు కుటుంబంతో సహా వ్యక్తిగత పని నిమిత్తం విజయవాడకు వెళ్లారు. తిరిగి వచ్చే సరికి ఇంట్లో సుమారు కోటి రూపాయల విలువైన సొత్తు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో నార్సింగి పోలీసులను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన పోలీసులు 24గంటల్లోనే కేసు ఛేదించి సొత్తును బాధితులకు అప్పగించారు. ఈనెల 9న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కుటుంబం విజయవాడకు వెళ్లడంతో దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు. అల్మారా పగలగొట్టి నగదు, బంగారు ఆభరణాలు కలిపి సుమారు కోటి విలువైన సొమ్మును చోరీ చేశారు. ఊరి నుంచి వచ్చిన బాధితులు దొంగతనం జరిగినట్లు గుర్తించి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికులే దొంగతనం చేసి ఉంటారని భావించి దర్యాప్తు ప్రారంభించాం. చోరీ అనంతరం ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ సేకరించాం. దొంగతనం జరిగిన ప్రాంతంలో కొన్ని వేలిముద్రలు గుర్తించాం. గంధంగూడకు చెందిన ప్రవీణ్ అనే అనుమానితుడి వేలిముద్రలు.. దొంగతనం జరిగిన ఇంట్లో వేలిముద్రలతో సరిపోయాయి. వెంటనే అతణ్ని అదుపులోకి తీసుకున్నాం. విచారణ అనంతరం నిందితుడి నుంచి చోరీకి గురైన సొత్తు మె?త్తం స్వాధీనం చేసుకున్నాం. కేసును కేవలం 24గంటల్లోనే ఛేదించాం' అని డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు.

## ఎపిలో పెట్టుబడులకు విన్‌ఫాస్ట్ కంపెనీ ఆసక్తి

### చంద్రబాబుతో సంస్థ ప్రతినిధుల భేటీ

అమరావతి,జూలై10(ప్రజామంటలు):



ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు వియత్నాంకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ విన్ ఫాస్ట్ ఆసక్తి చూపిస్తోంది. ఆ కంపెనీ ప్రతినిధి బృందం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. విన్ ఫాస్ట్ సీఈవో ఫామ్ సాన్ చౌ, ఆ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబుతో చర్చలు జరిపారు. విన్ ఫాస్ట్ కంపెనీకి అనువైన భూములను పరిశీలించాల్సిందిగా పరిశ్రమల శాఖను ఆదేశించానని వివరించారు. విన్ ఫాస్ట్ సంస్థతో విజయవంతమైన భాగస్వామ్యం కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. విన్ ఫాస్ట్... వియత్నాంకు చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీ సంస్థ ఏపీలో విద్యుత్ ఆధారిత వాహనాలు, బ్యాటరీల తయారీ పరిశ్రమ స్థాపించాలని విన్ ఫాస్ట్ సంస్థ ఆసక్తిగా ఉంది. విన్ ఫాస్ట్ నిజానికి తమిళనాడులో ఎ÷-లాంట్ పెట్టాలనుకుంది. తుత్తుకూడిలో శంకుస్థాపన కూడా చేశారు. కానీ తర్వాత నిర్మాణం ముందుకు సాగలేదు. ఈవీ వాహనాల తయారీలో ఎంతో పేరెన్నిక గన్న విన్ ఫాస్ట్ భారత్ మార్కెట్ పై చాలా కాలంగా కసరత్తు జరుపుతోంది. ఇప్పటికే విన్ ఫాస్ట్ బ్రాండ్ కార్లను ఇండియాలో టెస్టింగ్ చేస్తున్నారు. ఈ కంపెనీ మిడ్-సైజ్ ఎస్‌యూవీ ఇండియాలో టెస్టింగ్ చేస్తున్నట్లుగా కొన్ని ఆటోమొబైల్ న్యూస్ పోర్టళ్లు రిపోర్టు చేశాయి. ప్రస్తుతం వియత్నాం , ఇండోనేషియాలో విన్ ఫాస్ట్ ఈవీలు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. ఈ కార్లు కేవలం 9 సెకన్లలో 0-100కెఎంపిహెచ్ వేగాన్ని అందుకుంటాయి. ఈవీల్లో ఇది అత్యుతమైన సామర్థ్యమని అనుకోవచ్చు. కియా సెల్టోస్, హ్యుందాయ్ క్రెటా, మారుతి గ్రాండ్ విటారా, టయోటా అర్బన్ క్రూజర్ హైరైడర్, హోండా ఎలివేట్ , ఎంజి ఆస్టర్ వంటి మోడల్స్ తో పోటీ పడేలా కార్లను సిద్ధం చేస్తుంది. ఆటోమొబైల్ రంగంలో ఆంధ్రప్రదేశ్ కు మంచి బ్రాండ్ నేమ్ ఉంది. కియా కంపెనీ ఉత్పత్తిని రికార్డు స్థాయిలో ప్రారంభమయ్యేలా చేయడంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపించింది. ఈ క్రమంలో విన్ ఫాస్ట్ తో కూడా చర్చలు ఫలప్రదంగా ముగిస్తే.. ప్లాంట్ నిర్మాణానికి ముందుకు వచ్చే అవకాశాలు ఉంటాయని భావిస్తున్నారు.

## స్టీల్ ఫ్యాక్టరీ ప్రధాని పరిధిలో ఉంది కేంద్రమంత్రి



విశాఖపట్నం,జూలై10(ప్రజామంటలు):

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరణ మంత్రుల పరిధిలో ఉండే అంశం కాదని ఉక్కుశాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేబినెట్ చర్చించి తీసుకోవాల్సిన నిర్ణయమని తెలిపారు. గెయిల్‌లో విలీనం ప్రతిపాదనలు పరిశీలనలోఉన్నాయని వాటి మీద కొన్ని హద్దులు, అభ్యంతరాలు ఉన్నాయని వివరించారు. స్టీల్ ఎ÷-లాంట్‌లో పరిస్థితులు అవగాహన కోసమే కేంద్ర మంత్రి కుమార స్వామి పర్యటిస్తున్నారని చెప్పారు. సెయిల్,ఔఓఆఅ,స్టీల్ ఎ÷-లాంట్ ఉన్నతాధికారులు, బ్యాంకర్లతో కుమార స్వామి సమావేశం అవుతారని అన్నారు. స్టీల్ ఎలాంట్ సమస్యల పరిష్కారం కోసం ఉన్న మార్గాలను పరిశీలన చేస్తామన్నారు. ఈ పర్యటనలో అద్భుతాలు ఉండకపోవచ్చని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

## క్రీడలను పట్టించుకోని గత ప్రభుత్వం

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



కడప,జూలై10(ప్రజామంటలు):

రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేక పోయినా పులివెందుల్లో హాకీ ఆంధ్రప్రదేశ్ పోటీ నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా ఈ పోటీలను నిర్వహిస్తున్న హాకీ ఆంధ్రప్రదేశ్ అధికారులను అభినందిస్తు న్నానని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న స్టేడియాలను ఆధునికరిస్తామని చెప్పారు. మంచి శిక్షణ ఇచ్చేలా తీర్చిదిద్దుతామని వివరించారు. జగన్ ప్రభుత్వంలో క్రీడా శాఖ ఒకటి ఉంది అన్నది కూడా ప్రజలు మర్చిపోరని విమర్శించారు. పదేళ్ల వైసీపీ చివరి పాలనలో 'ఆడుదాం ఆంధ్ర' అంటూ ఒక ఈవెంట్ మాత్రమే నిర్వహించారని గుర్తుచేశారు. 'ఆడుదాం ఆంధ్రా'కు రూ.130 కోట్లు ఖర్చు చేసి క్రీడాకారుల కడుపు కొట్టారని మండిపడ్డారు.క్రీడాకారుల జీవితాన్ని వాళ్ల చేతుల్లోకి తీసుకొని రూ.130 కోట్లు ఖర్చు చేశారన్నారు. క్రీడాకారుల కోసం కాకుండా కేవలం వైసీపీ నాయకుల ప్రచారం కోసం వాడుకున్నారని ధ్వజమెత్తారు. క్రీడాకారుల సొమ్ము వాడుకున్న వారి నుంచి కక్కిచ్చేందుకు ప్రత్యేకంగా కమిటీ వేస్తున్నామని ప్రకటించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో పేద గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల ద్వారా శాప్ ద్వారా క్రీడా పోటీల నిర్వహిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి సురేఖ



వరంగల్,జూలై10 (ప్రజామంటలు):

వరంగల్ జిల్లా గీసుగొండ మండలం వంచనగిరి లో బోనాల మహోత్సవం సందర్భంగా మంత్రి కొండా సురేఖ బోనం ఎత్తుకొని సందడి చేశారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కట్టమైసమ్మకు బోనం సమర్పించిన మంత్రి కొండా సురేఖ మొక్కులు చెల్లించుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి ... తెలంగాణ ప్రజలందరూ పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కట్టమైసమ్మ తల్లిని ప్రార్థించానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, కాంగ్రెస్ నేతలు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, దేవాలయాల అభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



## అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

జనగామ జూలై 10 (ప్రజామంటలు):

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులను బెదిరింపులకు గురి చేస్తున్న సంఘటన జనగామ జిల్లాలో చోటుచేసుకుంది. జనగామ మండలం చీటకోడూరు గ్రామంలోని చీటకోడూరు యశ్వంతపూర్ వాగు పై నిర్మిస్తున్న చెక్ డ్యామ్ నుంచి గతంలో అనేకమార్లు అక్రమ ఇసుక రవాణా తరలిస్తున్న గ్రామస్తులు రైతులు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత రాత్రి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని అడ్డుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు లారీని అదుపులోకి తీసుకున్నారు. అక్రమ ఇసుక రవాణా అడ్డుకున్న యువకులను ట్రాక్టర్ యూనియన్ పేరుతో చలామణి అవుతున్న కొంతమంది వ్యక్తులు, చెక్ డ్యామ్ కాంట్రాక్టర్ బెదిరింపులకు గురి చేస్తున్నారని వారి వల్ల తమకు ప్రాణ హాని ఉందని గ్రామానికి చెందిన రావుల రఘు పోలీసుల లకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై విచారణ చేసి మాకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## బి.సి యువజన సంఘం జగిత్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా తిరుపురం రాంచందర్ నియామకం



జగిత్యాల జూలై 10 (ప్రజామంటలు):

హైదరాబాదులో బీసీ ముఖ్య నాయకుల సమావేశం శ్రీ ఆర్. కృష్ణయ్య ఎం.పి ఆధ్వర్యంలో జరిగింది. ఇట్టి సమావేశంలో జగిత్యాల పట్టణానికి చెందిన మున్నూరుకాపు కులస్తుడైన తిరుపురం రాంచందర్ ని వివిధ సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములైనందుకు, బి.సి లను చైతన్యపరిచినందుకు, మరియు గతంలో పట్టణ అధ్యక్షులుగా, నియోజకవర్గం అధ్యక్షులుగా పనిచేసినందున, మరియు వివిధ బి.సి ఉద్యమాల్లో పాల్గొన్నందుకు గాను బి.సి యువజన సంఘం జగిత్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా తిరుపురం రాంచందర్ ని నియమించనైనది. బి.సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎం.పి ఆర్. కృష్ణయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ సూచన మేరకు బి.సి యువజన సంఘం జగిత్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా తిరుపురం రాంచందర్ ని రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ వీరిని నియమించనైనది. వీరి నియామకం తేది: 10-07-2024 నుండి అమల్లోకి వచ్చునని రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, బి.సి. యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, జగిత్యాల జిల్లా బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మారిశెట్టి సూర్యప్రకాష్, జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి వారిని కలిసి అభినందించారు.

## జూలై 12న బోనాల పండగ, పోస్టర్ ను ఆవిష్కరణ



జగిత్యాల జూలై 10 (ప్రజామంటలు):

మేదిని లలిత కళాక్షేత్రం ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 12న బోనాల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నాట్య సామ్రాట్ బొమ్మిడి నరేష్ కుమార్ మరియు నాట్యరత్న మేదిని భుజంగ రావు తెలిపారు. బుధవారం విద్యానగర్ సీతారామచంద్రస్వామి దేవాలయంలో బోనాల పండుగ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ గారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకునే విధంగా బోనాల పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మేదిని లలిత కళాక్షేత్రం ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా ఎంతో మంది చిన్నారులకు నృత్య శిక్షణ ఇవ్వడంతో పాటు తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులతో ప్రతి సంవత్సరం బోనాల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ నాట్యాచార్యులు, కళాకారులు, చిన్నారులచే వివిధ నృత్య కళారూపకాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ధర్మపురి రోడ్డు లోని బిఎల్‌ఎన్ గార్డెన్లో ఈనెల 12న ఉదయం 9 గంటల నుండి రాత్రి వరకు కొనసాగుతుందని తెలిపారు. బోనాల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీతారామ దేవాలయ కమిటీ అధ్యక్షులు ఇనగంటి అశోక్ రావు, శివనార్తి చిరంజీవి,ఐల్నేని వెంకట్రావు, కమిటీ సభ్యులు మేదిని లలిత కళాక్షేత్రం సభ్యులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రుణమాఫీ కోసం సర్కార్ కసరత్తు

## నిధుల సమీకరణ కోసం నానా తంటాలు

## మూడు దశల్లో ఇచ్చేలా ప్రణాళికలు

హైదరాబాద్,జూలై 10 (ప్రజా మంటలు): రైతు రుణమాఫీ పథకానికి నిధుల కోసం నానా తంటాలు పడుతున్నట్లు తెలుస్తోంది. నిధుల సమీకరణ ప్రస్తుత సమయంలో చాల కష్టమైన పనిగా మారింది. గత కెసిఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి గుదిబండగా మారింది. ఈ క్రమంలె రుణమాఫీ కష్టమైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం అనేక మార్గాల్లో కసరత్తు చేస్తోంది. ఆగస్టు 15లోగా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిధుల సేకరణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ముఖ్యంగా ప్రతి నెలా తీసుకుంటున్న రుణాలను జాగ్రత్తగా ఖర్చు చేస్తూ, పాత అప్పుల కిస్తీలు కడుతూ ఎంతో కొంత నిధులను ఆదా చేస్తూ వచ్చింది. రాష్ట్ర ఖజానాకు వివిధ మార్గాల ద్వారా వస్తున్న ఆదాయంలోనూ కొంత మిగులుబాటు అయ్యేలా చూస్తోంది. రైతు రుణమాఫీ పథకం అమలుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. అందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటోంది. ముఖ్యంగా నిధుల సేకరణకు రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పలు మార్గాలను ఆలోచించి పెట్టుకుంది. వీటిపై కసరత్తు చేయాల్సిందిగా ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించింది. అదేసమయంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ స్థాయిలోనూ ప్రయత్నాలు చేస్తున్నారు.
మార్కెట్ నుంచి సేకరించే బడ్జెట్ అప్పులను జూలై, ఆగస్టు నెలల్లో ఎక్కువ మొత్తంలో తీసుకునేందుకు అవకాశం కల్పించాలని కేంద్రాన్ని కోరుతూనే.. భూములను హామీగా పెట్టి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్బీఎం పరిధిలోకి తీసుకోవద్దంటూ విజ్ఞప్తి చేస్తోంది. మరోవైపు నెలవారీగా తీసుకుంటున్న బడ్జెట్ రుణాలను ఖజానాలో జమ చేసి పెడుతోంది. ఇప్పటికే రుణమాఫీ పథకం కోసం రూ.10 వేల కోట్ల వరకు ఖజానాలో నిల్వ చేసినట్లు సమాచారం. వాస్తవానికి రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ప్రాథమికంగా అంచనా వేసిన మొత్తం. పథకాన్ని పూర్తిగా అమలు చేసేనాటికి నిధుల మొత్తం తగ్గవచ్చన్న అభిప్రాయాలున్నాయి. ఏదేమైనాఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఏప్రిల్‌లో రూ.4000 కోట్లు, మేలో 4000 కోట్లు, జూన్‌లో 5000 కోట్ల చొప్పున మార్కెట్ రుణాలను సేకరించింది. జూలై, ఆగస్టు నెలల్లో తీసుకునే మార్కెట్ రుణాల్లో కొన్ని నిధులను రుణమాఫీ పథకానికి మళ్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూలైలో రూ.6,500 కోట్లు, ఆగస్టులో రూ.5000 కోట్ల మేర రుణం తీసుకోవాలని ముందస్తు ప్రణాళికను నిర్దేశిరచుకుంది. ఆ 11,500 కోట్లలో ప్రభుత్వ వ్యయాలు, పాత అప్పుల కిస్తీలు పోను ఎంతో కొంత ఆదా చేయనుంది. ఈ రెండు నెలల రుణాల్లో ఇప్పటికే రూ.2000 కోట్లు తీసుకున్నందున మిగతా రూ.9,500 కోట్లలో ఒకేసారి ఎక్కువ మొత్తాన్ని తీసుకోవడానికి అనుమతి ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. కేంద్రం అనుమతించి, ఒకేసారి పెద్ద మొత్తంలో రుణం తీసుకుంటే ఎక్కువ భాగాన్ని రుణమాఫీ పథకానికి మళ్లించాలని సర్కారు యోచిస్తోంది. రుణమాఫీ పథకంతో పాటు ఇతర వ్యయాల కోసం ప్రభుత్వం పలు రకాలుగా నిధుల సేకరణ ప్రయత్నాలు చేస్తోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ



భూములను ప్రైవేటు బ్యాంకుల వద్ద హామీగా పెట్టి రుణాలు తీసుకోవడంపై కసరత్తు చేస్తోంది. కానీ, ఇలాంటి రుణాలపై కొన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రుణాలను కూడా ఎఫ్ఆర్బీఎం పరిధిలోనే లెక్కిస్తామంటూ కేంద్ర ప్రభుత్వం భీష్మిస్తే ఇబ్బంది తప్పదన్న అభిప్రాయాలున్నాయి. ఇలాంటి రుణాలను ఎఫ్ఆర్బీఎం పరిధిలోకి తీసుకోవద్దంటూ సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రధాని, ఆర్థిక మంత్రిని కోరారు. దీనికి కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంది. మరోవైపు పరిశ్రమలకు కేటాయించిన భూములను వాణిజ్య, నివాస అవసరాల కోసం మార్పిడి చేయాలన్న ఆలోచన కూడా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చాలా భూములను పారిశ్రామిక యూనిట్లకు కేటాయించారు. కానీ, కొన్నింటిలో ఎలాంటి యూనిట్లు ఏర్పాటు కాలేదని, ఆర్థిక, పారిశ్రామిక ఉత్పత్తి కార్య కలాపాలను ప్రారంభించలేదని ప్రభుత్వం గుర్తించింది. అలాంటి భూములను నివాసయోగ్య స్థలాలుగా మార్చి, విక్రయించే ఆలోచన చేస్తోంది. ఇలా వచ్చే నిధులను రుణమాఫీ పథకానికి మళ్లించడంతో పాటు రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలకు వినియోగించాలన్న ఆలోచనలో ఉంది.అందుకే రుణమాఫీని 3 దశలుగా అమలు చేయాలని యోచిస్తోంది. ముందుగా రూ.లక్ష లోపు రుణాలను, తర్వాత రూ.లక్షన్నర లోపు, అనంతరం రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేయాలని భావిస్తోంది. ఇదంతా కొన్ని రోజుల తేడాతో సాగే ప్రక్రియ అయినందున.. ఒకేసారి రుణమాఫీ పథకాన్ని వర్తింపజేశామని చెప్పనుంది.

# పోలింగ్ కేంద్రానికి వెళ్లలేదు ఇవిఎంలు పగులగొట్టలేదు

## విచారణలో స్పష్టంచేసిన పిన్నెల్లి



నెల్లూరు,జూలై10 (ప్రజా మంటలు): పోలింగ్ రోజున పల్నాడు జిల్లా, రెంటచింతజీ మండలం, పాలువాయి గేటు పోలింగ్ కేంద్రానికి తాను వెళ్లలేదని, ఈవీఎం పగులగొట్టలేదని, అసలు నంబూరి శేషగిరిరావు ఎవరో తనకు తెలియదని, ఆరోజు తన వెంట గన్ మెన్ కూడా లేరని, పోలీసుల విచారణలో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితెలిపారు. నెల్లూరు జైల్లో మంగళవారం రెండో రోజు పిన్నెల్లి పోలీస్ కస్టడీ విచారణ కొనసాగింది. పల్నాడు జిల్లా, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డికి పోలీస్ కస్టడీ విచారణ కొనసాగుతోంది. నెల్లూరు జిల్లాలో పిన్నెల్లిని పల్నాడు జిల్లా పోలీసులు మొదటి రోజు విచారించారు. విచారణకు ఆయన సరిగా సహకరించలేదని తెలుస్తోంది. పాలువాయి గేటు 202 పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం చేయడమే కాకుండా అడ్డుకున్న టీడీపీ కార్యకర్త నంబూరి శేషగిరిరావుపై దాడి చేసిన ఘటనపై పిన్నెల్లిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. మరుసటి రోజు పరామర్శ పేరుతో కారంపూడిలో భారీగా అల్లర్లకు పాల్పడడమే కాకుండా విధుల్లో ఉన్న సీఐ నారాయణ స్వామిపై రాయితో దాడి చేశారు. ఈ ఉదంతంపై మరో కేసు నమోదైంది. ఈ కేసులకు సంబంధించి నెల్లూరు జైల్లో ఉన్న రామకృష్ణా రెడ్డి నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు కోర్టు అనుమతితో పల్నాడు పోలీసులు నెల్లూరు జైలుకు వెళ్లి విచారణ చేపట్టారు. సోమవారం ఉదయం 10 గంటలకు డీఎస్పీతోపాటు 11 మంది పోలీసులు నెల్లూరు జైలు వద్దకు చేరుకున్నారు. వారిని అధికారులు లోపలకు అనుమతించలేదు. దీంతో వారు కోర్టును ఆశ్రయించారు. సాయంత్రం 3 గంటలకు కోర్టు నుంచి ఆదేశాలు రావడంతో ఏడుగురిని జైల్లోకి అనుమతించారు. 3 గంటలకు ప్రారంభమైన విచారణ రాత్రి 7 గంటల వరకు సాగింది. పిన్నెల్లిని 50 ప్రశ్నలు అడగ్గా 30 ప్రశ్నలకు పైగా 'నేను వెళ్లలేదు.. వారెవరో నాకు తెలియదు..' అనే సమాధానాలు చెప్పినట్లు సమాచారం.తొలిరోజు విచారణ పూర్తి చేసిన పోలీసులు, రెండోరోజు మంగళవారం కూడా విచారించారు. పోలింగ్ అనంతరం కారంపూడిలో అల్లర్లు, నారాయణస్వామిపై దాడికి సంబంధించి పిన్నెల్లిని ప్రశ్నంచారు. ఆయన సహకరిస్తే అనేక ప్రశ్నలకు సమాధానాలు వస్తాయని పోలీసులు చూస్తున్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి రెండు రోజుల పోలీసు కస్టడీ విధిస్తూ మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అడిషనల్ న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ తీర్పునిచ్చారు. మే 13న పోలింగ్ రోజు రెంటచింతల మండలం పాలువాయి గేటు 202 పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసాన్ని అడ్డుకున్న టీడీపీ కార్యకర్త నంబూరి శేషగిరిరావుపై దాడి, 14న కారంపూడిలో సీఐ నారాయణస్వామిపై దాడి కేసుల్లో పిన్నెల్లిని నెల్లూరు సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుల్లో పిన్నెల్లికి 2 రోజుల పాటు పోలీసు కస్టడీ విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. నెల్లూరు సెంట్రల్ జైలులోనే విచారణ జరపాలని, వీడియో తీయాలని పేర్కొన్నారు.

# జర్నలిస్టులపైనా అరెస్టు సరికాదు

## - ఓయూ ఘటనలపై హరీశ్‌రావు ఆగ్రహం



హైదరాబాద్,జూలై 10 (ప్రజా మంటలు): ఉస్మానియా యూనివర్సిటీ సాక్షిగా జర్నలిస్టుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు బిఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రకటించారు. డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిరసనలు తెలియజేస్తుంటే, విధి నిర్వహణలో భాగంగా ఆ వార్తలు కవర్ చేయడమే వారు చేసిన తప్పా? అని నిలదీశారు. జర్నలిస్టులను అరెస్టు చేయడం, బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించడం మీడియా హక్కును, స్వేచ్ఛను కాలరాయడమే అని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల పట్ల అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని మార్చుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. అదుపులోకి తీసుకున్న జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ లైబ్రరీ వద్ద డీఎస్సీ అభ్యర్థుల ఆందోళనలను కవరేజ్ చేసేందుకు వెళ్లిన జీ న్యూస్ రిపోర్టర్ పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించిన సంగతి తెలిసిందే. జీ న్యూస్ రిపోర్టర్ చొక్కా పట్టుకుని పోలీసులు లాక్కెళ్లారు. నేను జర్నలిస్టును.. మీ పని మీరు చేసుకోండి.. మా పని మేం చేసుకుంటాం అంటుంటే కూడా పోలీసులు వినిపించుకోకుండా, బలవంతంగా పోలీసు వాహనంలో ఎక్కించారు.



# నటుడు రాజ్‌తరుణ్‌పై నార్సింగ్‌లో కేసు

## లావణ్య ఫిర్యాదుతో నమోదు

హైదరాబాద్,జూలై 10 (ప్రజా మంటలు): సినీ నటుడు రాజ్ తరుణ్ పై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. తనను ప్రేమించి మోసం చేశాడంటూ లావణ్య అనే యువతి ఫిర్యాదు మేరకు 420, 506, 493 సెక్షన్ల కింద రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.రాజ్‌తరుణ్, తాను 2012 నుంచి రిలేషన్‌లో ఉన్నామని, ఇటీవల మరో సినీనటితో అతను సన్నిహితంగా ఉన్నట్టు తెలిసిందని లావణ్య ఫిర్యాదులో పేర్కొంది. 'తిరగబడర సామీ' సినిమా షూటింగ్ జరిగినప్పటి నుంచి ఈ రిలేషన్ కొనసాగిస్తున్నట్టు తేలిందని, ఇదే విషయమై అతన్ని నిలదీస్తే తనని దుర్భాషలాడాడని తెలిపింది. తనను బెదిరించారని, సంబంధం లేని కేసులో ఇరికించడంతో తాను 43 రోజులు జైల్లో ఉండాల్సి వచ్చిందని పేర్కొంది. 'రాజ్‌తరుణ్‌తో నాకు పదేళ్ల క్రితమే వివాహ మైంది. ఇద్దరం కలిసే జీవిస్తున్నాం. కొన్నాళ్ల క్రితం నాకు అబార్షన్ చేయించాడు. ఇద్దరం కలిసి విదేశాలకు కూడా వెళ్లాం' అని అందుకు సంబంధించి కొన్ని ఆధారాలను లావణ్య పోలీసులకు చూపించారు. దర్యాప్తు చేసిన పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు.

# ప్రజ్వల్ రేవణ్ణ తల్లికి సుప్రీం నోటీసులు

## - మహిళను కిడ్నాప్ చేసిన కేసులో తాఖీదులు



న్యూఢిల్లీ (ప్రజా మంటలు):మహిళను కిడ్నాప్ చేసిన కేసులో ప్రజల్వ్ రేవణ్ణ తల్లి భవానీ రేవణ్ణ కు సుప్రీంకోర్టు బుధవారంనాడు నోటీసులు పంపింది. భవానీ రేవణ్ణ కు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయడాన్ని కర్ణాటక 'సిట్' సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసును రాజకీయం చేయవద్దని తొలుత ధర్మాసనం స్పష్టం చేసినప్పటికీ ఎట్టకేలకు సిట్ విజ్ఞప్తి మేరకు భవానీ రేవణ్ణకు నోటీసు జారీ చేసేందుకు అంగీకరించింది. కేసు విచారణ సందర్భంగా కర్ణాటక సిట్ తరఫున కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ, భవానీ రేవణ్ణకు ముందస్తు బెయిలుతో హైకోర్టు ఉపశమనం కలిగించడం దురదృష్టకరమని అన్నారు. దీనిపై జస్టిస్ కాంత్ వెంటనే స్పందిస్తూ, రాజకీయ కారణాలను పక్కనపెట్టి హైకోర్టు చెప్పిన కారణాలు చూడండని సూచించారు. నిందితురాలు మహిళ అని, 55 ఏళ్ల వయస్సు అని, అకృత్యాలకు పాల్పడినట్టు ఆమె కుమారుడిపై ఆరోపణలు ఉన్నాయని, అతను పరారై ఆ తర్వాత పట్టుబడ్డాడని అన్నారు. కొడుకు చేసిన నేరాలను ప్రోత్సహించడంలో తల్లి పాత్ర ఏమిటి? అందుకు సాక్ష్యాలున్నాయా? ఆమెకు నోటీసులు జారీ చేయాల్సిన అవసరం ఏముంది? అని జస్టిస్ కాంత్ ఒక దశలో ప్రశ్నించారు. సీఆర్‌పీసీ సెక్షన్ 164 కింద జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారని, బాధితురాలి నిర్బంధించడంలో భవానీ పాత్ర ప్రస్తావన ఇందులో ఉందని సిబల్ పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ కాంత్ తిరిగి స్పందిస్తూ, ఒక మహిళకు ఉన్న స్వేచ్ఛ అంశాన్నే తాము పరిశీలిస్తున్నామని, ఆమె దోషి అయినట్లయితే అంతిమంగా విచారణలో తేలుతుందని అన్నారు. సిబల్ తన వాదనను తిరిగి కొనసాగిస్తూ, మహిళ అనే కారణంగా ఆమెకు నేరంలో ప్రమేయం లేదనే అభిప్రాయానికి బెంచ్ రాకూడదని అన్నారు. వాదోపవాదనల అనంతరం ఎట్టకేలకు భవానీ రేవణ్ణకు నోటీసులు పంపేందుకు ధర్మాసనం అంగీకరించింది. కిడ్నాప్ ఆరోపలను ఎదుర్కొంటున్న భవానీ రేవణ్ణకు హైకోర్టు గత నెలలో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కుటుంబ జీవితంలో మహిళల పాత్ర కీలకమని, అకారణంగా కస్టడీకి పంపకుండా మహిళా పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని జస్టిస్ కృష్ణ ఎస్ దీక్షిత్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. విచారణకు భవాని రేవణ్ణ సహకరిచడం లేదనే వాదన కూడా సరికాదని, పోలీసులు వేసిన 85 ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారని కూడా జస్టిస్ దీక్షిత్ గుర్తుచేశారు. భవానీ రేవణ్ణకు ముందస్తు బెయిలు మంజురు చేస్తూ, ఇన్వెస్టిగేషన్ సమయంలో మినహాయిస్తే మైసూరు, హసన్ జిల్లాల్లోకి ఆమె అడుగుపెట్టరాదనే షరతు విధించారు.

# నిరుద్యోగులను అవమానించిన రేవంత్

## ఉస్మానియాలో పోలీసుల ప్రవేశం దారుణం - మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ విమర్శలు

హైదరాబాద్,జూలై 10 (ప్రజా మంటలు): విద్యార్థులను, నిరుద్యోగులను సన్నాసులని రేవంత్ రెడ్డి అవమానిస్తున్నాడని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ ఘాటుగా స్పందించారు. రేవంత్ రెడ్డి నిరుద్యోగుల కోసం రాహుల్ గాంధీని తీసుకొని అశోక్ నగర్‌లో తిప్పినప్పుడు.. ఆ రోజు రాహుల్ గాంధీ సన్నాసా? రేవంత్ రెడ్డి సన్నాసా? అని గాదరి కిశోర్ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో గాదరి కిశోర్ మీడియాతో మాట్లాడారు. ఇవాళ రాష్ట్రంలో నిరుద్యోగులు డీఎస్సీ వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ పరమైన ఇబ్బందులు ఉంటే కారణాలు చెప్పి నిరుద్యోగులను ఒప్పించే ప్రయత్నం చేయాలి. అది ప్రభుత్వం బాధ్యత. అది చేయకుండా దమనకాండను సృష్టించే విధంగా తెలంగాణ ఉద్యమంలో కూడా ఉస్మానియాలోకి పోలీసులు అడుగు పెట్టలేదు. ఒక్కసారి మాత్రమే పోలీసులు చొరబడి, వికృత చర్యలకు పాల్పడితే ఆ రోజు ఉద్యమ తీవ్రతను గమనించిన హైకోర్టు జోక్యం చేసుకొని క్యాంపస్‌లోకి పోలీసులు వెళ్లొద్దని ఆదేశించింది. ఉద్యమ రోజులను తలదన్నే విధంగా మళ్లీ నిన్న వికృత చేష్టలతో పోలీసులు విద్యార్థులను ఇబ్బంది పెట్టారు అని గాదరి కిశోర్ పేర్కొన్నారు. 20 వేలతో మెగా డీఎస్సీ వేయొచ్చు కదా..? టెట్ నిర్వహించిన తర్వాత 45 రోజుల సమయం ఇవ్వండి. మారిన సిలబస్‌ను చదవుకోవడానికి 25 రోజుల సమయం సరిపోదు. తమ ఆవేదనను అర్థం చేసుకోవాలని డీఎస్సీ అభ్యర్థులు వేడుకుంటున్నారు. దాంతో పాటు ఎస్‌జీటీలు పదోన్నతులు పొందడంతో మరో 9 వేల పోస్టులు ఖాళీగా ఏర్పడ్డాయి. గతంలో



బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేసిన 5 వేలకు మరో 6 వేలు కలిపి 11 వేలకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ వేసింది. ఇప్పుడు డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్ ఏంటంటే.. ఎస్జీటీలు పదోన్నతులు పొందగా మిగిలిన 9 వేల పోస్టులను కలిపితే 20 వేలు అవుతాయి. 11 వేలతో మెగా డీఎస్సీ కాదు.. 20 వేలతో వేస్తే మాకు లాభం జరుగుతది అని అభ్యర్థులు అంటున్నారు. 25 వేలతో మెగా డీఎస్సీ వేస్తానని చెప్పిన రేవంత్.. ఇప్పుడు 20 వేలతో మెగా డీఎస్సీ వేయొచ్చు కదా..? అని గాదరి కిశోర్ నిలదీశారు. నిరుద్యోగులను అవహేళన చేసుకుంటూ అసభ్యకరంగా మాట్లాడారు రేవంత్ రెడ్డి. నిన్న ఓయూలో వందల మందిని అరెస్టు చేసి కరెంట్ తీసేసి చిత్రహింసలు పెట్టారు. ప్రజా పాలన అని మాట్లాడే రేవంత్ ఏం చేస్తున్నాడు. రేపట్నుంచి హాల్ టికెట్ ఇస్తామంటున్నారు.. ఎందుకంటే ఉద్యోగాలు అమ్ముకున్నాడు. ఫిక్స్ అయిపోయింది. వాయిదా వేస్తే ఇబ్బంది అయితదని. అమ్ముకున్న ఉద్యోగాలకు వసూళ్లు చేయాలి.. కప్పం కట్టాలి కాబట్టి ఇబ్బంది అయితదని ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించి తీరుతా అని రేవంత్ రెడ్డి అంటున్నారు అని కిశోర్ మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగులను అందర్నీ అవమానించే విధంగా సన్నాసులు వాయిదా వేయమంటున్నారు. చదవు రానోళ్లు ఆందోళన చేస్తున్నరు అని మాట్లాడుతున్నారు అవమానకరంగా. సన్నాసులట.. మరి నువ్వు నిరుద్యోగుల కోసం రాహుల్‌ను అశోక్‌నగర్‌లో తిప్పినప్పుడు ఎవరు సన్నాసి. నిరుద్యోగుల ఆర్తనాదాలు 9 ఏండ్ల నుంచి వినబడుతలేవా.. గ్రూప్-1 వాయిదా వేయాలని రేవంత్ ట్వీట్ చేశారు కదా.. మరి ఎవరు సన్నాసి అని గాదరి కిశోర్ నిలదీశారు.

# విడాకులు ఇచ్చినా భరణం ఇవ్వాల్సిందే

## ముస్లిం మహిళ కేసులో సుప్రీం కీలక తీర్పు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ముస్లిం మహిళలకు భరణం ఇచ్చే విషయంలో బుధవారం సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. విడాకుల తర్వాత వారు కూడా భరణానికి అర్హులని స్పష్టం చేసింది. 125 సీఆర్‌పీసీ ప్రకారం విడాకులు తీసుకున్న తన భార్యకు భరణం చెల్లించాలంటూ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఓ ముస్లిం వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టీన్, జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. విడాకుల తర్వాత తమ భర్త నుంచి వారు భరణం కోరవచ్చని తీర్పునిచ్చింది. భరణానికి సంబంధించిన హక్కును కల్పించే ఆ సెక్షన్‌ను విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు వర్తింపజేస్తున్నట్లు తెలిపింది. సెక్షన్ 125 వివాహితలకే కాకుండా మహిళలందరికీ వర్తిస్తుంది. మతంతో సంబంధం లేకుండా ఈ సెక్షన్ కింద వివాహితలు భరణం కోరవచ్చు. భరణం ఇవ్వడం అనేది దాతృత్వం కాదు. భార్య తమపై మానసికంగా, ఇతర రకాలుగా ఆధారపడి ఉంటుందనే వాస్తవాన్ని కొందరు భర్తలు గుర్తించడం లేదు. గృహిణి పాత్రను, ఆమె త్యాగాన్ని గుర్తించాల్సిన సమయం వచ్చిందని ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ప్రతి నెలా బాధిత మహిళకు 10వేల రూపాయలు ఇవ్వాలని పిటిషనర్ ను సుప్రీంకోర్టు ఆదేశించింది. విడాకులు తీసుకున్న తన భార్యకు భరణం ఇవ్వాలన్న తెలంగాణ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో సవాల్ చేశారు పిటిషనర్. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థించింది. నిర్వహణ అనేది దాతృత్వం కాదని.. వివాహిత మహిళల హక్కు అని సుప్రీం కోర్టు తెలిపింది. గృహిణి అయిన భార్య మానసికంగా.. తమపై ఆధారపడుతుందనేది భర్తలకు తెలియదా అని, ప్రతీ పరుషుడు గృహిణి పాత్రను గుర్తించాలని జస్టిస్ నాగరత్న అన్నారు.

# కాంగ్రెస్ వశం కానున్న పీర్జాదిగూడ

## బిఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పిన మరో 15 మంది కార్పొరేటర్లు



హైదరాబాద్, (ప్రజా మంటలు): మాజీ మంత్రి మల్లారెడ్డికి మరో భారీ షాక్ తగిలింది. ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 15 మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్‌ను వీడారు. దీంతో ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ బలం మరింత పెరిగింది. త్వరలోనే ఫిర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం కానుంది. అయితే, ఈ 15 మంది కార్పొరేటర్లతో డిప్యూటీ మేయర్ శివకుమార్ ఆధ్వర్యంలో గోవాలో క్యాంప్ రాజకీయం నడుపుతున్నారు. మొన్న జవహర్ నగర్, నిన్న బోడుప్పల్ కాంగ్రెస్ కైవసం అయ్యాయి. అదే బాటలో ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కూడా హస్తగతం కానుంది. మరోవైపు పార్టీ మారుతున్న కార్పొరేటర్లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి నిలువరించలేకపోయారు. వారిని అడ్డుకోలేక చేతులెత్తేశారు. ఈ వ్యవహారంలోనే మంగళవారం నాడు జరిగిన ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ మీటింగ్‌లో రసాభాస చోటు చేసుకుంది. తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లను కిడ్నాప్ చేశారని.. బలవంతంగా, బెదిరింపులకు పాల్పడి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఇదిలాఉండగా.. ఎమ్మెల్యేలే పార్టీలు మారుతున్న వేళ కార్పొరేటర్లు సైతం తామెంత అనుకుంటూ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఇక్కడ మరో ప్రచారం కూడా జరుగుతోంది. గత కొంత కాలంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరిగింది. ఇటీవలి కాలంలో ఈ ప్రచారం మరింత ఊపందుకుంది. ఈ తరుణంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 15 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మల్లారెడ్డే వెనుక ఉండి ఇదంతా నడిపిస్తున్నారా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.



బల్లిపడిన టిఫిన్లు..చిట్టెలుక పడ్డ చట్నీలు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా

# కాంగ్రెస్ మార్క్..మార్పు వచ్చింది

హైదరాబాద్, (ప్రజా మంటలు): మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి అని అన్నారని.. మొత్తానికి.. కాంగ్రెసోళ్లు వచ్చారు.. పెద్ద మార్పే తెచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో దుస్థితి.. పురుగుల అన్నం.. నీళ్ల చారు ఉండేవన్నారు. ఈనాటి కాంగ్రెస్ పాలనలో.. ప్రభుత్వ హాస్టళ్లలో ఇంకా అధ్వాన్న పరిస్థితి ఉందన్నారు. బల్లిపడిన టిఫిన్లు, చిట్టెలుకలు తిరిగే చట్నీలు పిల్లలకు వడ్డిస్తున్నారన్నారని ఫైర్ అయ్యారు. మొన్న భువనగిరి సాంఘిక సంక్షేమ పాఠశాలలో.. కలుషిత ఆహారం తిన్న విద్యార్థి జీవితం విషాదాంతంగా మారిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. నిన్న కోమటిపల్లి హాస్టల్‌లో ఉప్మాలో బల్లి పడి.. 20 మంది విద్యార్థులకు వాంతులు అయ్యాయన్నారు. సుల్తాన్ పూర్ జేఎన్టీయూ హాస్టల్‌లో చట్నీలో చిట్టెలుక దర్శనంతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఈ విషాహారం తింటే.. విద్యార్థుల ప్రాణాలకు గ్యారెంటీ ఎవరని ప్రశ్నించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న తల్లిదండ్రులకు భరోసా ఎక్కడుందని నిలదీశారు. కలుషిత ఆహారం వల్ల... పిల్లలు ఆడుకోవాల్సిన వయసులో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. అస్తవ్యస్థంగా మారిన ప్రభుత్వ వ్యవస్థ వల్లే.. విద్యార్థులకు ఈ అవస్థ... ఈ అస్వస్థత.. అని పేర్కొన్నారు. ఇకనైనా కాంగ్రెస్ సర్కారు కళ్లు తెరవాలన్నారు. లేకపోతే.. భావిభారత పౌరుల నిండు ప్రాణాలకే ప్రమాదమన్నారు. వైఫల్యాలను సరిచేయకపోతే ఊహించని విషాదం చోటు చేసుకుంటుందని తెలిపారు.

# 2లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

## కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈటెల ప్రశ్న



హైదరాబాద్, (ప్రజా మంటలు): రెండు లక్షల ఉద్యోగాలు ప్రకటిస్తామని ఎన్నికలకు ముందు వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే వాటి ఊసే ఎత్తడం లేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. జాబ్ క్యాలెండర్ ఏమ్యిందని, మెగా డిఎస్సీ ఎక్కడ పోయిందని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ గద్దనెక్కిందని అన్నారు. మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్స్‌లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్ ఆధ్వర్యంలో ఉప్పల్ అసెంబ్లీ కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... కాంగ్రెస్ సర్కారుపై అవిశ్వాసం ప్రకటించిన నిరుద్యోగ యువత యుద్ధం చేస్తున్నారని విమర్శించారు. పీర్జాదిగూడలో 1985లో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూల్చడం సరికాదన్నారు. ఉప్పల్‌లో 35 ఏళ్ల క్రితం పేదలు నిర్మించుకున్న ఇళ్లను వక్ఫ్ భూములు అంటూ ప్రభుత్వ స్థలాలుగా చెప్పడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, భేతి సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమలకు ఇచ్చిన భూముల తనఖా

## సర్కార్ యత్నిస్తోందని కెటిఆర్ ఆరోపణ

హైదరాబాద్, (ప్రజా మంటలు): రాష్ట్ర ఆర్థిక రంగాన్ని సరిగ్గా నడపడం చేతకాని రేవంత్ సర్కార్ ఇప్పుడు నిధుల సమీకరణకు ఒక ప్రమాదకరమైన మార్గం ఎంచుకున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ పరిశ్రమల శాఖకు చెందిన రూ. 20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలకు తనఖాపెట్టి రూ.10 వేల కోట్లు సమీకరించాలని భావిస్తున్నట్టు సమాచారం ఉందని ఆయన తెలిపారు. దీనికి మధ్యవర్తిగా ఒక మర్చంట్ బ్యాంకర్‌ను పెట్టి వారికి రు.100 కోట్ల కమీషన్ ఇచ్చేందుకు సిద్ధమైంది అని మీడియాలో కథనాలు వస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మతిలేని చర్య వల్ల తెలంగాణ ప్రగతి శాశ్వతంగా కుంటుపడి, కొత్తగా పెట్టుబడులు, పరిశ్రమలు రాక, ఉద్యోగాలు రాక, మన బిడ్డలకు కొలువులు రాకుండా పోయే ప్రమాదం ఉన్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లోనే ఎక్కువగా ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. అలాంటి చోట 400 ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తనఖా పెట్టడం అనాలోచిత చర్య. అసలే గత ఏడు నెలలుగా రాష్ట్ర పారిశ్రామికరంగం స్తబ్దుగా ఉంది. కొత్తగా పెట్టుబడులు రావడం లేదు. ఉన్న కంపెనీలు కూడా సరైన ప్రోత్సాహం లేక పక్కచూపులు చూస్తున్నాయి. ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కొరకు పరిశ్రమలకు ఇచ్చే భూములు తాకట్టు పెడితే.. కంపెనీలకు ఏమిస్తారు? కొత్తగా మన యువతకు ఉద్యోగాలు ఎట్లా వస్తాయి? అని రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు.

# ప్రభుత్వం కూలాలి..తాము గద్దెనెక్కాలి

## బిజెపి తీరు ఇలాగే ఉందన్న రాఘవులు - లౌకికశక్తులను రేవంత్ ఏకం చేయాలని పిలుపు



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణలో ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందా.. ఎప్పుడు గద్దెనెక్కుదామని భాజపా కాచుక్కూర్చుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ కుట్రలను తిప్పికొట్టేందుకు లౌకికశక్తులను సీఎం రేవంత్‌రెడ్డి ఏకం చేయాల్సిన అవసరముందన్నారు. ప్రజలపై కేంద్రం మోపిన భారాన్ని మరిచిపోయి..రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కిషన్‌రెడ్డి చదువుతున్నారని రాఘవులు మండిపడ్డారు. కేవలం రాష్ట్రప్రభుత్వాన్ని తిట్టిపోయడం మాని, కేంద్రం ఏం చేసిందో...ఏం చేస్తుందో చెప్పాలన్నారు. దేశమంతా అభివృద్ధి జరిగితే ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భాజపాకు సీట్లు ఎందుకు తగ్గాయో ప్రధాని మోదీ చెప్పాలని రాఘవులు ప్రశ్నించారు. రష్యా పర్యటనలో ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. మరోవైపు పార్లమెంట్‌లో ఇష్యూ టు ఇష్యూను బట్టి వ్యవహరిస్తామని కేటీఆర్ చెబుతున్నారని రాఘవులు గుర్తుచేశారు. అలా స్పందించడం రాజకీయం కాదు.. లొంగుబాటు అని వ్యాఖ్యానించారు. భారాసకు మనుగడ ఉండాలంటే భాజపాకు వ్యతిరేకంగా రాజకీయ నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సీట్లు ఎందుకు తగ్గాయనే ఆలోచన, ఆత్మవిమర్శ చేసుకోకుండా మోదీ వ్యాఖ్యలు చేస్తున్నారు. ఎన్నికలను భాజపా డబ్బుతో ముంచేసింది. తెలంగాణలో ఆ పార్టీ ఓటు బ్యాంకు 19 నుంచి 35 శాతానికి పెరగడం ప్రమాదకరం. రాష్ట్రంలో భాజపాను నియంత్రించడంలో కాంగ్రెస్ విఫలమైంది. కేరళలో కాషాయ పార్టీ ఒక్క సీటు సాధించడం చింతించాల్సిన విషయం. అక్కడ కమ్యూనిస్టులను కాంగ్రెస్ ప్రతిపక్షంగా చూసినందునే భాజపా గెలిచింది. కార్పొరేట్ శక్తులకు సేవకుడిగా మోదీ వ్యవహరిస్తున్నారు. ఇండియా కూటమి విచ్ఛిన్నం కాకుండా ముందుకు వెళ్లడంలో సీపీఎం చేసిన త్యాగం మరెవరూ చేయలేదు. పశ్చిమబెంగాల్‌లో సీపీఎం, కాంగ్రెస్ సీట్లు సర్దుబాటు చేసుకున్నా కాంగ్రెస్‌కు చెందిన ఏ ఒక్క జాతీయ నాయకుడూ ప్రచారం నిర్వహించలేదు. ఓట్లు, సీట్లు కాదు.. దేశాన్ని రక్షించుకోవడమే సీపీఎం లక్ష్యం. మతోన్మాదాన్ని తెలంగాణ ప్రజల మనసు నుంచి తీసివేసే బాధ్యత సీపీఎంపై ఉంది.

# ఉత్తరాఖండ్ ఎమ్మెల్యే శైలారాణి మృతి



నైనినాటల్,జూలై 10 (ప్రజా మంటలు): ఉత్తరాఖండ్ జిల్లాలో బీజేపీకి చెందిన ఓ ఎమ్మెల్యే మరణించారు.ప్రముఖ పుణ్యక్షేత్రం కేదార్‌నాథ్ ఎమ్మెల్యే శైలా రాణి రావత్ డెహ్రాడూన్లోని మ్యాక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం ఆమె వయసు 68 ఏళ్లు. వెన్నెముక గాయం కారణంగా ఇటీవలే ఆసుపత్రిలో చేరిన ఆమెకు వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. అయితే ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం రాత్రి ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శైలారాణి రావత్.. 2012లో కాంగ్రెస్ టికెట్‌పై తొలిసారిగా కేదార్‌నాథ్ స్థానం నుంచి ఉత్తరాఖండ్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అయితే, 2016లో ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీష్ రావత్‌పై 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేశారు. వారిలో ఆమె కూడా ఉన్నారు. ఆ తర్వాత 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. 2022లో బీజేపీ టికెట్‌పై పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

# మైనర్ బాలిక రేప్..హత్య

## మిస్టరీ వీడిన బాలిక అదృశ్యం



నంద్యాల,జూలై 10 (ప్రజా మంటలు): నంద్యాల జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం చేసి, హత్య చేశారు.ఇలా ముచ్చుమర్రిలో బాలిక అదృశ్యంపై మిస్టరీ వీడింది. ఈ ఘటనలో ముగ్గురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలికపై అత్యాచారం చేసి ఎత్తిపోతల కాలవలో పడేసినట్లు పోలీసులు తెలిపారు. అనుమానితులు ముగ్గురు 15 ఏళ్ల లోపువారేనని తెలిపారు. ఆదివారం తన స్నేహితులతో కలిసి పాత ముచ్చుముర్రి లోని పార్కులో ఆడుకోడానికి వెళ్లిన బాలిక అదృశ్యం అయింది. దీంతో సాయంత్రం అయినా తన బిడ్డ ఇంటికి రాకపోవడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి.. బాలిక ఆచూకీని త్వరగా గుర్తించాలని పోలీసులను ఆదేశించారు. జూపాడుబంగ్లా, మిడుతూరు, ముచ్చుముర్రి, బ్రాహ్మణ కొట్కూరు తదితర ప్రాంతాల్లో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో జాగిలం తో గాలించారు. జాగిలం స్థానిక ముచ్చుమర్రి పార్క్ నుంచి ఎత్తిపోతల పథకం పరిసరాల్లో తిరిగి పంపుహౌస్ వద్దకు వచ్చి ఆగిపోయింది. దీంతో అనుమానిత బాలురిని అదుపులోకి తీసుకొని విచారించగా తామే అత్యాచారం చేసి కాలువలోకి నెట్టేసినట్టు ఒప్పుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎనిమిదేళ్లుగా పదవి లేకుండా దూరం పెట్టారు

- సికింద్రాబాద్ టిక్కెట్ ఇచ్చవుంటే గెలిచే వాడిని
- కాంగ్రెస్ మాజీ ఎంపి విహెచ్ ఆవేదన



హైదరాబాద్,జూలై10 (ప్రజా మంటలు): గత ఎనిమిదేళ్లలో తనకు ఒక్క పదవీ లేదని.. రాజ్యసభ ఎంపీగా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు (వీహెచ్) కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీ టికెట్ తనకు ఇస్తే గెలిచేవాడినని వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడారు. టికెట్ విషయంలో తనకు అన్యాయం జరిగిందన్నారు. తెలంగాణ పర్యటనకు వస్తున్న కురియన్ కమిటీ తొలుత ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలును కలవాలన్నారు. 'టీ20 వరల్డ్‌కప్ గెలిచిన టీమ్ ఇండియాకు శుభాకాంక్షలు. జట్టు సభ్యుడైన హైదరాబాదీ సిరాజ్‌కు ఇంటి స్థలం, ఉద్యోగం ఇస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. దేశంలో క్రికెట్‌కు మంచి క్రేజ్ ఉంది. తెలంగాణలో క్రీడలను సీఎం ప్రోత్సహించాలి. రాష్ట్రంలో హైదరాబాద్‌లో తప్ప ఎక్కడా క్రికెట్ స్టేడియం లేదు. ఏపీలో 12 ఉన్నాయి. తెలంగాణలోని ప్రతి జిల్లాలో స్టేడియం నిర్మాణానికి 12 ఎకరాల స్థలాన్ని సీఎం కేటాయించాలి. గతంలో క్రీడలను కేటీఆర్ ప్రోత్సహించలేదు.. ఎకరం భూమి కూడా కేటాయించలేదు. అసెంబ్లీ సమావేశాల్లో క్రీడలకు ఎక్కువ బడ్జెట్ కేటాయించాలి. రుణమాఫీ చేస్తున్న రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు' అని వీహెచ్ తెలిపారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TEL-TEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com